TGTEL/26/A2635

వాస్తవాలు పలుకు

# DD9 వార్త

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 02 | సంచిక: 66 | 19-07-2026 ఆదివారం | పేజీలు: 08 | వెల: 3/-




## రూ. 2.55 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి.



06




02

## అంతరిక్షంలోకి దూసుకెళ్లిన 'విక్రమ్1'

భారత ప్రైవేట్ స్పేస్ రంగంలో కొత్త అధ్యాయం
శ్రీహరికోట నుంచి స్కైరూట్ తొలి
ఆర్బిటల్ రాకెట్ విజయవంతమైన ప్రయోగం
35 నిమిషాల ఆలస్యానంతరం నింగిలోకి..
నిర్ణీత కక్ష్యలోకి చేరిన ఉపగ్రహాలు
ప్రధాని మోదీ చేతిరాత
'వందేమాతరం'తో పాటు ప్రత్యేక పేలోడ్లు
'మిషన్ ఆగమన్'తో భారత ప్రైవేట్
అంతరిక్ష రంగానికి చారిత్రక ముందడుగు

## హర్మ్యూజ్‌లో పేలిన చమురు ట్యాంకర్లు

ఐఆర్‌జీసీ సంచలన ప్రకటన..
'అది అవాస్తవం' అంటూ ఖండించిన అమెరికా
హర్మ్యూజ్ జలసంధిలో రెండు
ట్యాంకర్లు పేలిపోయాయని ఇరాన్
రివల్యూషనరీ గార్డ్స్ ప్రకటన
అమెరికా నిఘా సంస్థలే ఆ మార్గంలో
పంపాయని ఐఆర్‌జీసీ ఆరోపణ
ఈ వాదనను పూర్తిగా
ఖండించిన అమెరికా సెంట్‌కామ్
యుద్ధం మరింత ఉధృతం..
బాబ్ అల్-మాండెబ్‌పైనా ఉద్రిక్తతలు



02

## ఆయిల్‌పామ్ రైతుల కోసం దక్షిణాది ఏకమవ్వాలి

దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ
మంత్రులకు తుమ్మల నాగేశ్వరరావు లేఖ
ప్రధానిని కలిసి రైతుల
సమస్యలు వివరించాలని ప్రతిపాదన
ఆయిల్‌పామ్‌కు కనీస హామీ ధర
రూ.25 వేలుగా నిర్ణయించాలని విజ్ఞప్తి
దిగుమతి సుంకాన్ని 44 శాతానికి
పునరుద్ధరించాలని కేంద్రానికి డిమాండ్

**హైదరాబాద్, (డిడి9 వార్త):** ఆయిల్‌పామ్ రైతుల ప్రయోజనాల పరిరక్షణ కోసం దక్షిణాది రాష్ట్రాలు ఏకతాటిపైకి రావాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వంపై సంయుక్తంగా ఒత్తిడి తీసుకురావాలనే ఉద్దేశంతో దక్షిణాది రాష్ట్రాల మిగతా 2లో..



## బుల్లెట్ ట్రైన్ భూసేకరణపై ఉద్రిక్తత

హైడ్రా అధికారులను అడ్డుకున్న రైతులు
తోపులాటలో ఓ రైతు అస్వస్థత
650 ఎకరాలకు కంచె వేసేందుకు
వెళ్లిన రెవెన్యూ, హైడ్రా అధికారులకు నిరసన
ఆర్డీవోతో వాగ్వాదం.. నినాదాలతో
ఆందోళనకు దిగిన స్థానికులు
పోలీసులతో తోపులాటలో రైతు నరసింహ
స్పృహతప్పి పడిపోవడం
సమస్య పరిష్కరించాకే కంచె
వేయాలని రైతుల డిమాండ్



**హైదరాబాద్, (డిడి9 వార్త):** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని బహదూర్‌గూడలో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం చేపట్టిన మిగతా 2లో..

## కల్వకుంట్ల కుటుంబం నిజాంను మించిన ధనవంతులు

ఘట్‌కేసర్‌లో అందెశ్రీ స్మృతివనానికి భూమిపూజ
అందెశ్రీ ఒక ఆత్మబంధువు అని కొనియాడిన సీఎం రేవంత్ రెడ్డి
కేసీఆర్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు
ఏడాదిలోనే 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని వెల్లడి
తాను సీఎంగా ఉండగా బీఆర్‌ఎస్ అధికారంలోకి రాదని స్పష్టం

**హైదరాబాద్, (డిడి9 వార్త):** కేసీఆర్ కుటుంబం వందలాది ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు నిర్మించుకుందని, వారు నిజాం రాజును మించిన ధనవంతులుగా ఎదిగారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రముఖ కవి, గాయకుడు, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిదాత అందెశ్రీ గౌరవార్థం ఘట్‌కేసర్‌లో నిర్మించనున్న 'అందెశ్రీ స్మృతివనం' పనులకు ముఖ్యమంత్రి శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగిస్తూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

"దొరల గడీల ముందు తలవంచను" అని చాటిచెప్పిన ధైర్యశాలి అందెశ్రీ అని ముఖ్యమంత్రి కొనియాడారు. ప్రజల కవిగా, గాయకుడిగా అందెశ్రీ అందించిన సేవలను స్మరించుకుంటూ, మిగతా 2లో..



# కాంగ్రెస్ కు డెత్ డిక్లరేషన్

యువ గళాలు గర్జిస్తే కుర్చీలు కూలిపోతాయి
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు
సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సు
యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయలేదని ఆరోపణ
70 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పకుంటానని సవాల్
ఉద్యోగాల కంటే రాహుల్‌గాంధీ రాజకీయాలపైనే రేవంత్ దృష్టి అని వ్యాఖ్య



**హైదరాబాద్, (డిడి9 వార్త):** యువత గళం బలంగా వినిపిస్తే అధికార కుర్చీలు కూడా కూలిపోతాయని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఇప్పటివరకు ఒక లెక్క అయితే.. ఇకపై మరో లెక్క ఉంటుందని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.


కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రకటించిన యూత్ డిక్లరేషన్ యువతను మోసం చేసేందుకేనని ఆరోపించిన కేటీఆర్.. ఆ పార్టీకి యువత డెత్ డిక్లరేషన్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమ సమయంలో వేలాది మంది విద్యార్థుల ప్రాణాలు పోవడానికి కాంగ్రెస్ బాధ్యత వహించాలని ఆరోపించారు. యువతతో రాజకీయాలు చేస్తే ఆ ప్రభావం తరాలపాటు ఉంటుందని వ్యాఖ్యానించారు. యూత్ డిక్లరేషన్‌లో మిగతా 2లో..

## స్కైరూట్ బృందానికి ప్రధాని మోదీ అభినందనలు

### ఇది తొలి అడుగు మాత్రమే..

ఇంకా గొప్ప విజయాలు సాధించాలి' అంటూ ప్రశంసలు
విక్రమ్1 విజయవంతమైన ప్రయోగం అనంతరం
స్కైరూట్ వ్యవస్థాపకులకు ఫోన్ చేసిన ప్రధాని
పవన్‌కుమార్ చందన, నాగ్ భరత్‌తో మాట్లాడిన మోదీ
నిర్ణయించిన లక్ష్యాలను ముందుగానే సాధించారని ప్రశంస
భారత ప్రైవేట్ అంతరిక్ష రంగానికి
విక్రమ్1 చారిత్రక మైలురాయిగా అభివర్ణన

**హైదరాబాద్, (డిడి9 వార్త):** భారత అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థల సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచిన స్కైరూట్ ఏరోస్పేస్ తొలి ఆర్బిటల్ క్లాస్ రాకెట్ *'విక్రమ్ 1'* విజయవంతమైన ప్రయోగంపై ప్రధాని నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రయోగం విజయవంతంగా పూర్తైన అనంతరం స్కైరూట్ వ్యవస్థాపకులు పవన్‌కుమార్ చందన, నాగ్ భరత్‌కు ఫోన్ చేసి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రయోగాన్ని తాను ప్రత్యక్షంగా వీక్షించినట్లు ప్రధాని తెలిపారు. "మీరు అనుకున్న సమయానికంటే ముందుగానే మీ లక్ష్యాలను సాధించారు. ఈ ప్రయోగాన్ని నేను వీక్షించాను. ఇందులో భాగమైన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు, కృతజ్ఞతలు. ఈ మిషన్ మిగతా 2లో..



## కల్తీపై ఉక్కుపాదం

ఆహార, ఔషధ కల్తీల నిరోధానికి కఠిన చట్టం
తెలంగాణకు ప్రత్యేక TGFADCA చట్టం రూపకల్పన
విదేశీ చట్టాల అధ్యయనానికి అధికారులకు ఆదేశం
బిల్లుపై శాసనసభలో సమగ్ర చర్చ నిర్వహించనున్న ప్రభుత్వం
ప్రజల అభిప్రాయాలు తీసుకుని చట్టానికి తుది రూపం
విజిల్‌బ్లోయర్ల వ్యవస్థ, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు
సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణకు ప్రత్యేక విధానం
క్యూర్ ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు
కల్తీపై కఠిన చర్యలకు ప్రభుత్వం సిద్ధం
ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్న సీఎం

**హైదరాబాద్, (డిడి9 వార్త):** ఆహార పదార్థాలు, ఔషధాల్లో పెరుగుతున్న కల్తీని పూర్తిగా అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కఠిన చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తెలంగాణకు ప్రత్యేకంగా *తెలంగాణ ఫుడ్ అడల్టరేషన్ అండ్ డ్రగ్ కంట్రోల్ యాక్ట్ (TGFADCA)* రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ చట్టం రూపకల్పన, అమలు విధానాలపై ఎంసీహెచ్ఆర్డీలో శనివారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో సీఎం మిగతా 2లో..



## పేపర్ లీకేజీలతో ఎన్నో కుటుంబాల్లో విషాదం

విద్యా వ్యవస్థను పూర్తిగా మార్చాల్సిందే
కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ డిమాండ్
ప్రశ్నాపత్రాల లీకేజీలపై
రాహుల్ తీవ్ర ఆవేదన
దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థ
పునర్నిర్మాణానికి రాహుల్ పిలుపు
నీట్ వివాదంతో ప్రాణాలు
కోల్పోయిన విద్యార్థిని రియా
'ఎక్స్' పోస్టులో బాధితురాలి
తండ్రి బాధ ప్రస్తావన
రాజేశ్ ఆవేదన ప్రతి ఒక్కరినీ
కలచివేస్తోందన్న రాహుల్
విద్యార్థులకు న్యాయం జరిగే
వరకు పోరాటం చేస్తామని వెల్లడి

**హైదరాబాద్, (డిడి9 వార్త):** దేశంలో వరుసగా జరుగుతున్న పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీల ఉదంతాలపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అత్యంత తీవ్రంగా స్పందించారు. ఈ దారుణమైన లీకేజీల కారణంగా దేశంలోని మిగతా 2లో..



# కాంగ్రెస్ కు డెత్ డిక్లరేషన్

మొదటిపేజీ తరువాయి

రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించిన కేటీఆర్.. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి బదులుగా అవినీతి, అక్రమాలే పెరిగాయని విమర్శించారు. తెలంగాణలో ఉద్యోగ నోటిఫికేషన్లు కనిపించడం లేదని, 'లూటీ నోటిఫికేషన్లే' కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకుల రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం 70 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు నోటిఫికేషన్లతో సహా నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని కేటీఆర్ సవాల్ విసిరారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబుతున్నారని, ఆయనకు పదవి ఇచ్చింది తెలంగాణ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకా, లేక రాహుల్ గాంధీకి రాజకీయ ప్రయోజనం చేకూర్చేందుకా అని ప్రశ్నించారు.

తెలుగు, ఆంగ్ల సంవత్సరాలు మారుతున్నా ఉద్యోగాల వార్షిక ప్రణాళిక మాత్రం మారడం లేదని కేటీఆర్ విమర్శించారు. అసెంబ్లీలో ప్రకటించిన ఉద్యోగాల ప్రణాళిక ఇప్పుడు విలువలేని కాగితంగా మారిందని ఆరోపించారు. యువత తమ హక్కుల కోసం పోరాడేందుకు



ముందుకు వచ్చిందని పేర్కొంటూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చకపోతే తీవ్ర రాజకీయ పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

## బుల్లెట్ ట్రైన్ భూసేకరణపై ఉద్రిక్తత

మొదటిపేజీ తరువాయి

భూసేకరణ వ్యవహారం ఉద్రిక్తతకు దారితీసింది. ప్రాజెక్టు కోసం సేకరించిన సుమారు 650 ఎకరాల భూమికి కంచె ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ అధికారులు, హైడ్రా సిబ్బంది పోలీసు బందోబస్తుతో శనివారం అక్కడికి చేరుకోగా, స్థానిక రైతులు, భూయజమానులు వారిని అడ్డుకున్నారు.

భూములకు కంచె వేయొద్దంటూ రైతులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీధర్‌తో స్థానికులు తీవ్ర వాగ్వాదానికి దిగారు. తమ సమస్యలు పరిష్కరించకుండా, భూ వివాదాలను పరిష్కరించకుండా కంచె వేయడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.

పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రైతులను వెనక్కి పంపే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో రైతులు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో రైతు నరసింహ అస్వస్థతకు గురై స్పృహ తప్పి కుప్పకూలారు. వెంటనే అధికారులు ఆయనను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించగా, తోటి రైతులు అడ్డుకుని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు, భూసేకరణకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కంచె వేయడానికి అనుమతించబోమని రైతులు స్పష్టం చేశారు. భూములకు తగిన పరిహారం, ఇతర హామీలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఘటన నేపథ్యంలో బహదూర్‌గూడలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. రైతులతో చర్చలు జరిపి సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## కల్వకుంట్ల కుటుంబం నిజాంను మించిన ధనవంతులు

మొదటిపేజీ తరువాయి

ఆయనను తన 'ఆత్మబంధువు'గా అభివర్ణించారు. గత పాలకులు ఆయన వంటి గొప్ప కళాకారులను విస్మరించారని మండిపడ్డారు. ఇదే క్రమంలో, కల్వకుంట్ల కుటుంబంపై రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు.

గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతను పట్టించుకోకపోవడంతో వారు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ఏళ్ల తరబడి గ్రూప్ 1 వంటి పరీక్షలు కూడా నిర్వహించలేదని రేవంత్ రెడ్డి ఆరోపించారు. అందుకు భిన్నంగా, తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే సుమారు 70 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని, అభ్యర్థుల తల్లిదండ్రుల సమక్షంలోనే నియామక పత్రాలను అందజేస్తున్నామని తెలిపారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

ఫామ్‌హౌస్‌ల నిర్మాణం కోసం కేసీఆర్ కుటుంబం తెలంగాణ సంపదను దోచుకుందని, మళ్లీ ఎవరైనా అటువంటి ప్రయత్నం చేస్తే ఎదిరించడానికి అందెశ్రీ పాట రూపంలో పుడతాడని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందెశ్రీని తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని దుయ్యబట్టారు. ప్రజాకవి గద్దర్‌ను సైతం ప్రజాభవన్ గేటు వద్ద ఎర్రటి ఎండలో నిలబెట్టి అవమానించారని మండిపడ్డారు. వారిద్దరిని అవమానించినప్పుడే దొరల పాలనకు చరమగీతం పాడాలని తెలంగాణ ప్రజలు నిర్ణయించుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.



## హర్మూజ్‌లో పేలిన చమురు ట్యాంకర్లు

- ఐఆర్‌జీసీ సంచలన ప్రకటన..
- 'అది అవాస్తవం' అంటూ ఖండించిన అమెరికా
- హర్మూజ్ జలసంధిలో రెండు ట్యాంకర్లు పేలిపోయాయని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ప్రకటన
- అమెరికా నిఘా సంస్థలే ఆ మార్గంలో పంపాయని ఐఆర్‌జీసీ ఆరోపణ
- ఈ వాదనను పూర్తిగా ఖండించిన అమెరికా సెంట్‌కామ్
- యుద్ధం మరింత ఉధృతం.. బాబ్ అల్-మాండెబ్‌పైనా ఉద్రిక్తతలు

హైదరాబాద్, (డిడి9 వార్త):

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రమవుతున్నాయి. ప్రపంచ ఇంధన సరఫరాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి చుట్టూ సైనిక ఉద్రిక్తతలు కొనసాగుతుండగా, సముద్ర మైన్లు (మందుపాతరలు) మరో పెద్ద ముప్పుగా మారాయి. ఈ నేపథ్యంలో హర్మూజ్ జలసంధిలో రెండు చమురు ట్యాంకర్లు మైన్లను ఢీకొని పేలిపోయాయని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) శనివారం ప్రకటించింది. అయితే ఈ వాదనను అమెరికా సెంట్రల్ కమాండ్ వెంటనే ఖండిస్తూ, "ఇది పూర్తిగా అవాస్తవం" అని స్పష్టం చేసింది.

ఐఆర్‌జీసీ ప్రకటన ప్రకారం.. అమెరికా నిఘా సంస్థల సూచనలతో హర్మూజ్ దక్షిణ భాగంలోని మైన్లు ఉన్న మార్గంలో రెండు చమురు ట్యాంకర్లు ప్రయాణించాయని, దీంతో అవి పేలిపోయి మంటలకు ఆహుతయ్యాయని పేర్కొంది. అలాగే అదే మార్గంలో వెళ్లేందుకు ప్రయత్నించిన మరో నాలుగు నౌకలను క్షిపణులు, డ్రోన్ల సాయంతో అడ్డుకున్నామని వెల్లడించింది. అయితే ఈ ఘటనకు సంబంధించి ట్యాంకర్ల వివరాలు, స్వతంత్ర ధ్రువీకరణ మాత్రం వెలువడలేదు.

మరోవైపు అమెరికా వరుసగా ఏడో రోజు కూడా ఇరాన్‌పై వైమానిక దాడులు కొనసాగించింది. దక్షిణ ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లో భారీ పేలుళ్లు చోటుచేసుకున్నట్లు సమాచారం. అమెరికా దాడులు కొనసాగితే తాము పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధమవుతామని ఇరాన్ హెచ్చరించింది. అలాగే అమెరికా మిత్రదేశాల్లోని సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో ప్రతీకార దాడులను కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది.

ఇదే సమయంలో తమ విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించిన ఇరాన్.. ఎర్ర సముద్రంలోని బాబ్ అల్‌మాండెబ్ జలసంధిలో సముద్ర రవాణాకు అంతరాయం కల్పించే అవకాశాన్ని కూడా ప్రస్తావించింది. ఇరాన్‌కు మద్దతుగా ఉన్న హూతీ బలగాలు ఆ మార్గంలో చర్యలు చేపడితే ప్రపంచ చమురు, వాణిజ్య సరఫరా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు.



## ఆయిల్‌పామ్ రైతుల కోసం దక్షిణాది ఏకమవ్వాలి

మొదటిపేజీ తరువాయి

వ్యవసాయ మంత్రులకు ఆయన లేఖ రాశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి ఆయిల్‌పామ్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించాలని ప్రతిపాదించారు.

ఆయిల్‌పామ్ పంటకు కనీస హామీ ధరను టన్నుకు రూ.25 వేలుగా నిర్ణయించాలని తుమ్మల డిమాండ్ చేశారు. ఒకవేళ అది సాధ్యం కాకపోతే ముడి పామ్ నూనెపై దిగుమతి సుంకాన్ని మళ్లీ 44 శాతానికి పెంచాలని కేంద్రాన్ని కోరారు.

దిగుమతి సుంకాలను తగ్గించడం వల్ల దేశీయ ఆయిల్‌పామ్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మంత్రి పేర్కొన్నారు. ధరలు పడిపోవడంతో రైతులకు గిట్టుబాటు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

దేశంలో సాగవుతున్న ఆయిల్‌పామ్ పంటలో సుమారు 75 శాతం వాటా దక్షిణాది రాష్ట్రాలదేనని తుమ్మల గుర్తు చేశారు. రైతులకు స్థిరమైన ఆదాయం అందాలంటే కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని తగిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

వంటనూనెల ఉత్పత్తిలో దేశాన్ని స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్లాలంటే ముందుగా ఆయిల్‌పామ్ రైతులను రక్షించాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధన కోసం దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసి పనిచేసి రైతుల ప్రయోజనాల కోసం ఉమ్మడి కార్యాచరణ చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

## అంతరిక్షంలోకి దూసుకెళ్లిన 'విక్రమ్1'

- భారత ప్రైవేట్ స్పేస్ రంగంలో కొత్త అధ్యాయం
- శ్రీహరికోట నుంచి స్కైరూట్ తొలి ఆర్బిటల్ రాకెట్ విజయవంతమైన ప్రయోగం
- 35 నిమిషాల ఆలస్యానంతరం నింగిలోకి.. నిర్ణీత కక్ష్యలోకి చేరిన ఉపగ్రహాలు
- ప్రధాని మోదీ చేతిరాత 'వందేమాతరం'తో పాటు ప్రత్యేక పేలోడ్లు
- 'మిషన్ ఆగమన్'తో భారత ప్రైవేట్ అంతరిక్ష రంగానికి చారిత్రక ముందడుగు




హైదరాబాద్, (డిడి9 వార్త):

భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యానికి చారిత్రక మైలురాయి నెలకొంది. ప్రముఖ స్పేస్‌టెక్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన తొలి ఆర్బిటల్ క్లాస్ రాకెట్ 'విక్రమ్1' శనివారం విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం (షార్) తొలి ప్రయోగ వేదిక నుంచి మధ్యాహ్నం 12.05 గంటలకు ఈ ప్రయోగాన్ని చేపట్టగా, రాకెట్ విజయవంతంగా ప్రయాణించి తన పేలోడ్లను నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టింది.

వాస్తవానికి ఈ ప్రయోగాన్ని ఉదయం 11.30 గంటలకు నిర్వహించాల్సి ఉండగా, కౌంట్‌డౌన్ చివరి దశలో సాంకేతిక లోపం గుర్తించారు. ఇంధన నింపే ప్రక్రియలో సమస్య తలెత్తడంతో ప్రయోగాన్ని తాత్కాలికంగా నిలిపివేసి శాస్త్రవేత్తలు అత్యవసర పరిశీలనలు చేపట్టారు. లోపాన్ని సరిచేసిన అనంతరం 35 నిమిషాల ఆలస్యంగా రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించారు. దాదాపు 20 నిమిషాల ప్రయాణం అనంతరం విక్రమ్1 తన పేలోడ్లను నిర్ణీత లో ఎర్త్ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టింది. ప్రయోగం విజయవంతం కావడంతో "హలో స్పేస్... విక్రమ్1 వచ్చేసింది" అంటూ స్కైరూట్ సంస్థ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆనందాన్ని పంచుకుంది.

**అంతరిక్షంలోకి 'వందేమాతరం'**

ఈ ప్రయోగంలో సాంకేతిక పేలోడ్లతో పాటు ప్రత్యేకంగా రూపొందించిన భావోద్వేగ చిహ్నాలను కూడా రోదసిలోకి పంపించారు. ప్రధాని నరేంద్ర మోదీ స్వహస్తాలతో రాసిన 'వందేమాతరం' సందేశంతో కూడిన ప్రత్యేక పోస్టుకార్డును రాకెట్‌లో భద్రపరిచారు. అలాగే కాస్మోస్ డైమండ్స్ సంస్థ రూపొందించిన 'కాస్మిక్ బ్లూమ్' ఆర్ట్‌వర్క్, విక్రమ్1 రాకెట్ సూక్ష్మ ప్రతిరూపాన్ని కూడా అంతరిక్షంలోకి పంపించారు. ఆ ప్రతిరూపంపై భారత అంతరిక్ష, విజ్ఞాన రంగానికి సేవలందించిన సర్ సీవీ రామన్, డాక్టర్ విక్రమ్ సారాభాయ్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సూక్ష్మ చిత్రాలను చెక్కారు.

అంతేకాకుండా, ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ స్కైరూట్ బృంద సభ్యులు, ఇస్రో మాజీ ఛైర్మన్లు, శాస్త్రవేత్తలు, భారతీయ వ్యోమగాములు తదితరులు స్వహస్తాలతో రాసిన డజన్ల కొద్దీ పోస్టుకార్డులను ప్రత్యేక పేలోడ్ బాక్స్‌లో భద్రపరచి రోదసిలోకి పంపడం విశేషంగా నిలిచింది.

**'మిషన్ ఆగమన్'కు శ్రీకారం**

ఈ చారిత్రక ప్రయోగానికి స్కైరూట్ 'మిషన్ ఆగమన్' అనే పేరు పెట్టింది. భారత ప్రైవేట్ అంతరిక్ష రంగం ఆర్బిటల్ ప్రయోగాల యుగంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ పేరును ఎంపిక చేసినట్లు సంస్థ తెలిపింది. విక్రమ్1 ద్వారా గ్రహాస్పేస్, కాస్మోసెర్ఫ్, డీక్యూబ్డ్ సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ పేలోడ్లతో పాటు స్కైరూట్ అభివృద్ధి చేసిన 'స్కోప్' పేలోడ్‌ను కూడా రోదసిలోకి పంపించారు. ఈ ప్రయోగం ద్వారా రాకెట్‌లోని ప్రొపల్షన్, స్టేజ్ సెపరేషన్, గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ వ్యవస్థల పనితీరును అంతరిక్షంలో పరీక్షించి కీలక సాంకేతిక సమాచారాన్ని సేకరించనున్నారు. భవిష్యత్తులో వాణిజ్య ప్రయోగాలకు అవసరమైన సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా సంస్థ పేర్కొంది.

**పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో..**

సుమారు ఏడు అంతస్తుల భవనం ఎత్తుతో రూపొందించిన విక్రమ్1 పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో తయారైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన 3డీ ప్రింటెడ్ ఇంజిన్లు, ఘన ఇంధన బూస్టర్లతో పనిచేసే ఈ రాకెట్ 450 కిలోమీటర్ల ఎత్తులోని లో ఎర్త్ ఆర్బిట్‌లో 350 కిలోల వరకు చిన్న ఉపగ్రహాలను ప్రవేశపెట్టగల సామర్థ్యం కలిగి ఉంది. ఇప్పటికే 2022లో విక్రమ్‌ఎస్ ద్వారా భారత తొలి ప్రైవేట్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన స్కైరూట్... ఇప్పుడు 'విక్రమ్1'తో దేశపు తొలి ప్రైవేట్ ఆర్బిటల్ ప్రయోగాన్ని విజయవంతం చేసి భారత అంతరిక్ష రంగ చరిత్రలో మరో అరుదైన ఘట్టాన్ని లిఖించింది.

# కల్తీపై ఉక్కుపాదం

మొదటిపేజీ తరువాయి

పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

సమీక్ష సందర్భంగా రాష్ట్రంలో ఆహార పదార్థాల నుంచి ఔషధాల వరకు దాదాపు ప్రతి రంగంలో కల్తీ పెరుగుతున్న తీరుపై సీఎం తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు నిత్యం వినియోగించే పాలు, పెరుగు, నెయ్యి, వంటనూనెలు, మసాలా దినుసులు, తేనె, మిఠాయిలు, కూరగాయలు, పండ్లు వంటి అనేక వస్తువుల్లో కల్తీ జరుగుతోందని, ఇది ప్రజల ఆరోగ్యానికి పెద్ద ముప్పుగా మారిందన్నారు. ముఖ్యంగా ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువ రోజులు తాజాగా కనిపించేలా, పండ్లు త్వరగా మగ్గేలా రసాయనాలను విచ్చలవిడిగా ఉపయోగించడం వల్ల ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు.

పంటల ఉత్పత్తిలో కూడా ఎరువులు, పురుగు మందుల అధిక వినియోగం వల్ల రసాయన అవశేషాలు మిగులుతున్నాయని సీఎం చెప్పారు. ఈ కారణంగా కొన్ని వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడానికి విదేశీ దేశాలు నిరాకరిస్తున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయని గుర్తు చేశారు. వ్యవసాయ రంగానికి, రైతుల ఆదాయానికి కూడా ఇది ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. అందువల్ల కేవలం వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణ కోసమే కాకుండా వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత పెంపు కోసం కూడా కఠిన చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు.

మార్కెట్లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో అనేక వస్తువులు అధిక ధరలకు విక్రయిస్తున్నప్పటికీ అవి నిజంగా సేంద్రియ పద్ధతుల్లోనే తయారయ్యాయా లేదా అనే విషయాన్ని నిర్ధారించే బలమైన వ్యవస్థ ప్రస్తుతం లేదని సీఎం పేర్కొన్నారు. ఈ పరిస్థితి వినియోగదారులను మోసగించేలా ఉందని, అందువల్ల సేంద్రియ ఉత్పత్తులకు విశ్వసనీయ ధృవీకరణ వ్యవస్థను కూడా చట్టంలో భాగం చేయాలని అధికారులకు సూచించారు.

తెలంగాణకు తీసుకురానున్న చట్టం దేశంలోనే ఆదర్శంగా ఉండేలా రూపొందించాలని సీఎం స్పష్టం చేశారు. ఇందుకోసం ఆహార, ఔషధ కల్తీల నియంత్రణలో విజయవంతమైన వ్యవస్థలు అమలవుతున్న దేశాలను అధికారులు సందర్శించాలని సూచించారు. అక్కడి చట్టాలు, అమలు విధానం, శిక్షలు, తనిఖీ వ్యవస్థలు, ప్రయోగశాలల పనితీరు, వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆ నివేదిక ఆధారంగా తెలంగాణకు అనువైన సమగ్ర చట్టాన్ని రూపొందించాలని చెప్పారు.


చట్టం రూపొందించిన తర్వాత దానిని నేరుగా అమలు చేయకుండా ముందుగా శాసనసభలో విస్తృత చర్చ నిర్వహించాలని సీఎం తెలిపారు. అధికార పక్షంతో పాటు ప్రతిపక్ష సభ్యులు కూడా తమ సూచనలు చేసే అవకాశం కల్పించాలని, ప్రజల నుంచి కూడా అభిప్రాయాలు స్వీకరించాలని సూచించారు. సమాజంలోని అన్ని వర్గాల సూచనలను పరిగణనలోకి తీసుకుని చట్టానికి తుది రూపం ఇవ్వాలని ఆదేశించారు. దీని ద్వారా ప్రజలకు ఉపయోగపడే, సమర్థవంతమైన చట్టం రూపొందుతుందని అభిప్రాయపడ్డారు. కల్తీని అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని సీఎం పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కల్తీకి సంబంధించిన సమాచారాన్ని ప్రభుత్వానికి అందించే *విజిల్‌బ్లోయర్ల వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచే విధానాన్ని రూపొందించాలని చెప్పారు. అలాగే ప్రజలు అనుమానాస్పద ఆహార పదార్థాలు, ఔషధాలు లేదా కల్తీకి సంబంధించిన ఫిర్యాదులు చేయడానికి ప్రత్యేక **టోల్‌ఫ్రీ నంబర్* ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదులపై వేగంగా స్పందించి తనిఖీలు నిర్వహించే ప్రత్యేక వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు.

కొత్త చట్టాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి అమలు చేయకుండా ముందుగా *క్యూర్ (CURE)* ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అక్కడ చట్టం అమలులో ఎదురయ్యే సమస్యలు, లోటుపాట్లు, ప్రజల స్పందన, అధికార యంత్రాంగం ఎదుర్కొనే సవాళ్లను విశ్లేషించిన తర్వాత అవసరమైన మార్పులు చేసి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని సూచించారు. దీంతో చట్టం మరింత సమర్థవంతంగా అమలవుతుందని అభిప్రాయపడ్డారు.

కల్తీ ఆహారం, నకిలీ ఔషధాలు కేవలం వ్యక్తిగత ఆరోగ్య సమస్య మాత్రమే కాదని, అది ప్రజారోగ్యం, ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయం, ఎగుమతులు, వినియోగదారుల హక్కులు వంటి అనేక రంగాలపై ప్రభావం చూపే అంశమని సీఎం పేర్కొన్నారు. అందువల్ల ఈ సమస్యపై ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. కల్తీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టంలో బలమైన నిబంధనలు ఉండాలని అధికారులకు సూచించారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం, విశ్వసనీయమైన ఔషధాలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో కల్తీకి పూర్తిగా అడ్డుకట్ట వేసేలా చట్టాన్ని రూపొందించి దేశానికి ఆదర్శంగా నిలిపే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సి.వి. ఆనంద్, సీఎం సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు వి. శేషాద్రి, ఎన్. శ్రీధర్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## స్కైరూట్ బృందానికి ప్రధాని మోదీ అభినందనలు

మొదటిపేజీ తరువాయి




కేవలం తొలి అడుగు మాత్రమే. దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లి భారత అంతరిక్ష రంగాన్ని కొత్త శిఖరాలకు చేర్చాలి'' అని మోదీ పేర్కొన్నారు.

విక్రమ్1 విజయంతో భారత ప్రైవేటు అంతరిక్ష రంగం కొత్త యుగంలోకి అడుగుపెట్టిందని ఆయన అభినందించారు. స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన ఈ రాకెట్ దేశ యువ శాస్త్రవేత్తల ప్రతిభకు, భారత స్టార్టప్‌ల సామర్థ్యానికి ప్రతీకగా నిలిచిందని కొనియాడారు.

మరోవైపు, ప్రధాని నుంచి అభినందనలు అందుకోవడం తమకు గర్వకారణమని స్కైరూట్ వ్యవస్థాపకులు తెలిపారు. భారత అంతరిక్ష రంగంలో మరిన్ని వినూత్న ప్రయోగాలు చేపట్టి ప్రపంచ స్థాయిలో దేశ ప్రతిష్ఠను మరింత పెంచేందుకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. విక్రమ్1 విజయవంతమైన ప్రయోగంతో చిన్న ఉపగ్రహాల వాణిజ్య ప్రయోగాల రంగంలో భారత్‌కు కొత్త అవకాశాలు తెరుచుకున్నాయి. ఈ విజయం దేశీయ స్పేస్‌టెక్ స్టార్టప్‌లకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని అంతరిక్ష రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# పేపర్ లీకేజీలతో ఎన్నో కుటుంబాల్లో విషాదం

మొదటిపేజీ తరువాయి

ఎంతో మంది ప్రతిభావంతులైన విద్యార్థుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, వారు తీవ్రమైన మానసిక వేదనను అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన సమయం ఆసన్నమైందని, విద్యార్థులకు పూర్తి నమ్మకం, భద్రత కల్పించేలా దీనిని పునర్నిర్మించాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. శనివారం ఉదయం రాహుల్ గాంధీ తన అధికారిక సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఒక సుదీర్ఘమైన మరియు భావోద్వేగభరితమైన పోస్ట్‌ను పెట్టారు. ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా పెద్ద దుమారం రేపిన నీట్ (NEET) పరీక్ష పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో, తీవ్ర మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడిన రియా అనే విద్యార్థిని ఉదంతాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. రియా మరణం తర్వాత ఆమె తండ్రి రాజేశ్‌తో తాను స్వయంగా మాట్లాడిన విషయాలను, ఆ సమయంలో ఆయన పడిన బాధను రాహుల్ ఈ పోస్టులో గుర్తు చేసుకున్నారు.

కంటికి రెప్పలా పెంచుకున్న తన ప్రాణాలకంటే ఎక్కువైన కుమార్తెను కోల్పోయిన బాధతో తండ్రి రాజేశ్ గుండె పగిలేలా ఏడ్చారని, ఆయన మానసికంగా పూర్తిగా కుంగిపోయారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఒక మధ్యతరగతి తండ్రి తన బిడ్డను పెద్ద చదువులు చదివించి ప్రయోజకురాలిని చేయాలనుకుంటే, ఈ లీకేజీల వ్యవస్థ ఆమె ప్రాణాలనే బలితీసుకుందని మండిపడ్డారు. రాజేశ్ అనుభవిస్తున్న ఈ భరించలేని వేదన, కడుపుకోత విన్న ప్రతి ఒక్కరి హృదయాలను కలచివేస్తోందని రాహుల్ అన్నారు.

ఈ ఘోరమైన పరిణామం కేవలం ఒక రియా కుటుంబానికి సంబంధించిన వ్యక్తిగత విషాదం మాత్రమే కాదని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. దేశంలో పేపర్ లీకేజీలనేవి ఒక మాఫియాగా మారి లక్షలాది మంది విద్యార్థుల కలలను, వారి భవిష్యత్తును చిన్నాభిన్నం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం మరియు పరీక్షల నిర్వహణ సంస్థల వైఫల్యం వల్ల ఎంతో మంది అమాయక విద్యార్థులు నిరాశతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, పాలకుల తప్పులకు పిల్లలు బలికావడం దారుణమన్నారు.పోటీ పరీక్షల ఫలితాల జాబితాలో కనిపించే లేదా వార్తల్లో వినపడే ప్రతి విద్యార్థి పేరు వెనుక ఒక కన్నతల్లి, ఒక కన్నతండ్రి ఉంటారని రాహుల్ గాంధీ గుర్తు చేశారు. వారు తమ పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకుంటారని, వారి బంగారు భవిష్యత్తు కోసం అహర్నిశలు శ్రమిస్తారని చెప్పారు. కానీ ఈ లీకేజీల భూతం ఆ తల్లిదండ్రులకు తమ పిల్లలను శాశ్వతంగా దూరం చేస్తోందని, బిడ్డలు లేని ఆ కన్నవారి జీవితాలు రేపటి రోజు అనేది లేకుండా పూర్తిగా చీకటిమయంగా మారిపోతున్నాయని ఆవేదన చెందారు.

పరీక్షల విధానంలో ఉన్న లోపాల వల్ల విద్యార్థులు విపరీతమైన మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని రాహుల్ గాంధీ విశ్లేషించారు. అక్రమార్కుల చేతుల్లోకి పేపర్లు వెళ్తుంటే, కష్టపడి చదివే పిల్లలు అభద్రతాభావంతో నలిగిపోతున్నారన్నారు. విద్యార్థులు ఎలాంటి భయాలు, ఆందోళనలు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో, పూర్తి భద్రతతో పరీక్షలు రాసేలా ప్రస్తుత నిబంధనలను మార్చాలన్నారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత లేకపోతే యువత నమ్మకం కోల్పోతుందని హెచ్చరించారు.తమ పిల్లలను డాక్టర్లుగానో, ఇంజినీర్లుగానో చూడాలని తల్లిదండ్రులు తమ రక్తాన్ని చెమటగా మార్చి, తిండి తినితినక డబ్బులు కూడబెట్టి చదివిస్తారని, వారు చేసే త్యాగాలు అంత తేలికైనవి కావని రాహుల్ అన్నారు. కన్నవారు చేసిన ఆ త్యాగాలకు ప్రతిఫలంగా వారికి దక్కాల్సింది పిల్లల విజయాలు, వారి ముఖాల్లో సంతోషమే కానీ.. ఇలాంటి పేపర్ లీకేజీల వల్ల వచ్చే కన్నీళ్లు, గుండెకోత కాదన్నారు. న్యాయం కోసం ఎదురుచూస్తున్న



తల్లిదండ్రులకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని నిలదీశారు.

ఇకనైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి విద్యారంగంలో, పరీక్షల నిర్వహణ సంస్థల్లో సమూలమైన మార్పులను తీసుకురావాలని రాహుల్ గాంధీ గట్టిగా కోరారు. తప్పు చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చట్టాలు తేవాలన్నారు. దేశంలోని ప్రతి విద్యార్థికి పూర్తి భద్రత లభించే వరకు, బాధితులైన తల్లిదండ్రులకు న్యాయం జరిగే వరకు ప్రతిపక్ష నాయకుడిగా పార్లమెంట్ లోపలా, వెలుపలా తన పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉంటానని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.



## బీర్కూర్‌లో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

- **సర్పంచ్ అరిగే ధర్మతేజ చేతుల మీదుగా పనుల ప్రారంభం**

**బాన్సువాడ, జూలై 18(డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలోని రామాలయం ఎదురుగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ అరిగే ధర్మతేజ భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ అరిగే ధర్మతేజ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే గ్రామపంచాయతీ లక్ష్యమని తెలిపారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులను దశలవారీగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీర్కూర్ తహసీల్దార్ సవాయి సింగ్, సొసైటీ చైర్మన్ కొల్లి గాంధీ, ఉప సర్పంచ్ పరమేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యామ రాములు, మాజీ ఎంపీపీ రఘు, వార్డు సభ్యులు నవీన్, భాస్కర్, హైమద్, మహేష్, విజయ్ ప్రకాష్, ఆనంద్ పటేల్, విట్టల్ తదితరులు పాల్గొన్నారు

## డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి.. బీర్కూర్‌లో విషాదం

**బాన్సువాడ, జూలై 18(డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలో శనివారం విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు డ్రైనేజీలో పడి సంగెం విఠల్ (46) మృతి చెందాడు.స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఏఎస్ఐ అమృ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతుడిని గుర్తించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.మృతుడు విఠల్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు



.ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, స్థానికులు విషాదంలో మునిగిపోయారు.

## కామారెడ్డిలో టీఎస్ ఎస్సీ స్టడీ సర్కిల్ 'విజయగాథలు' పుస్తకావిష్కరణ

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 18(డిడి9 వార్త):**

హైదరాబాద్‌లోని తెలంగాణ షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో సాధించిన విజయాలను ప్రతిబింబించే "విజయగాథలు" పుస్తకాన్ని శనివారం కామారెడ్డి కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు.జిల్లా కలెక్టర్ ఆశిష్ షాంగ్వాన్ తన ఛాంబర్‌లో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, డిప్యూటీ కలెక్టర్ రవితేజ, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి పీ. వెంకటేష్, నిజామాబాద్ జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ దేవిదాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, పుస్తకంలో తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొంది వివిధ పోటీ పరీక్షల్లో విజయం సాధించిన అభ్యర్థుల స్ఫూర్తిదాయక విజయగాథలను పొందుపరిచినట్లు తెలిపారు. ఈ విజయగాథలు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ప్రేరణనిచ్చే మార్గదర్శిగా నిలుస్తాయని పేర్కొన్నారు.అలాగే, తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ అందిస్తున్న నాణ్యమైన శిక్షణ, సమర్థవంతమైన మార్గనిర్దేశం, వెనుకబడిన వర్గాల విద్యార్థుల అభివృద్ధికి సంస్థ చేస్తున్న విశేష కృషికి ఈ పుస్తకం నిదర్శనంగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు.



## నిజామాబాద్–కామారెడ్డి టీజీఈడబ్ల్యుఐడిసి ఈఈగా రవీందర్ బాధ్యతల స్వీకారం

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 18(డిడి9 వార్త):**

నిజామాబాద్-కామారెడ్డి జిల్లాల తెలంగాణ గిరిజన సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక ఇంజనీర్ (ఈఈ)గా రవీందర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆయన హనుమకొండ జిల్లా టీజీఈడబ్ల్యుఐడిసి ఈఈగా విధులు నిర్వహించారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేసిన రవీందర్, నిజామాబాద్-కామారెడ్డి జిల్లాల్లో టీజీఈడబ్ల్యుఐడిసి ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి పనులను నాణ్యతతో, వేగవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.



## ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించాలి: సీఎస్ సంజయ్ జాజు

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 18(డిడి9 వార్త):**

ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అన్ని జిల్లాలు ముందస్తు ప్రత్యామ్నాయ ప్రణాళికలను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించిన ఆయన, వర్షాభావ పరిస్థితుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఈ నెల 20న జిల్లా ఇంచార్జి మంత్రి అధ్యక్షతన నిర్వహించే ఉమ్మడి జిల్లా సమావేశంలో ప్రస్తుత పరిస్థితులను సమీక్షించి, ఆయా జిల్లాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని తెలిపారు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు ముందస్తు సన్నద్ధతతో ఉండాలని ఆదేశించారు.తాగునీటి సమస్యలు ఎక్కడా తలెత్తకుండా కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సూచించారు. అలాగే విద్యుత్ కోతలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్,డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకట్, డిప్యూటీ కలెక్టర్ రవితేజ, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధుల నియంత్రణకు సమగ్ర చర్యలు చేపట్టాలి: డీఎంహెచ్ఓ డాక్టర్ జె. వెంకట్

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 18(డిడి9 వార్త):**

సీజనల్ వ్యాధుల నియంత్రణ, ప్రజారోగ్య కార్యక్రమాల సమర్థవంతమైన అమలు, క్షేత్రస్థాయి ఆరోగ్య సేవల మెరుగుదలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ జె. వెంకట్ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరం, డయేరియా తదితర సీజనల్ వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించాలని సూచించారు. గుర్తించిన కేసులకు వెంటనే చికిత్స అందించడంతో పాటు అవసరమైన నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌ను 100 శాతం పూర్తి చేయాలని డీఎంహెచ్ఓ స్పష్టం చేశారు. వ్యాక్సిన్‌పై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు మత పెద్దలు, కుల పెద్దలు, ప్రజాప్రతిని



ధులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ సురక్షితమైనదని, బాలికలు, మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ఎంతో ఉపయోగపడుతుందని ప్రజలకు వివరించాలని తెలిపారు. అర్హులైన ప్రతి బాలికకు వ్యాక్సినేషన్ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అలాగే ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు అవసరమైన మందులు అందించడంతో పాటు వ్యాధులను ముందస్తుగా గుర్తించి తగిన చికిత్స అందించాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా సమన్వయంతో పనిచేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ జె. వెంకట్ పేర్కొన్నారు.





## రిపుల్స్ పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహణ

- **బాధ్యతాయుతమైన ఓటరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచన**

**బాన్సువాడ, జూలై 18(డిడి9 వార్త):**

పట్టణంలోని రిపుల్స్ పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించే ఉద్దేశంతో మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ కార్యక్రమానికి కౌన్సిలర్లు ఫెరోజ్, హకీమ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రాజబాబు మాట్లాడుతూ, నేటి విద్యార్థులే రేపటి బాధ్యతాయుతమైన పౌరులని అన్నారు. సమాజంలో జరిగే ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండటంతో పాటు క్రమశిక్షణ, మంచి విద్యతో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు.విద్యార్థుల్లో ఎన్నికల ప్రక్రియపై భయం, సందేహాలను తొలగించి ప్రజాస్వామ్య విలువలను పెంపొందించేందుకు మాక్ పోలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఓటు నమోదు, పోలింగ్ విధానాన్ని ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. పాఠశాల ఫౌండర్, చైర్మన్ అనిల్ కుమార్ పాటిల్ విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రతి విద్యార్థి బాధ్యతాయుతమైన ఓటరుగా, సమాజ అభివృద్ధికి తోడ్పడే ఆదర్శ పౌరుడిగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కామారెడ్డిలో ఎక్సైజ్ దాడులు.. లక్ష్మీ మెస్‌పై కేసు

- **అక్రమ మద్యం విక్రయాలు, సేవకు అనుమతిస్తే కఠిన చర్యలు: ఎక్సైజ్ సీఐ సంపత్ కృష్ణ**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 18(డిడి9 వార్త):**

జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ముకుంద్ రెడ్డి ఆదేశాల మేరకు కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని హోటళ్లు, మెస్‌లపై ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు .ఈ సందర్భంగా డిగ్రీ కాలేజ్ గ్రౌండ్ ఎదురుగా ఉన్న లక్ష్మీ మెస్లో అనుమతి లేకుండా మద్యం సేవించేందుకు అవకాశం కల్పిస్తూ మెస్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. దీంతో మెస్ నిర్వాహకుడు లింబయోల దిలీప్ రెడ్డిపై ఎక్సైజ్ చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు.ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ సంపత్ కృష్ణ మాట్లాడుతూ, కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని హోటళ్లు, మెస్‌లు, దాబాల్లో అనుమతి లేకుండా మద్యం విక్రయించడం లేదా మద్యం సేవించేందుకు అవకాశం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇలాంటి అక్రమాలపై సమాచారం ఉంటే వెంటనే ఎక్సైజ్ శాఖకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ సంపత్ కృష్ణ, ఎస్సై విక్రం కుమార్, హెడ్ కానిస్టేబుల్ ఫరీద్, కానిస్టేబుళ్లు రాజు, దినేష్ పాల్గొన్నారు.



# వాహన తనిఖీల్లో పోలీసుల చాకచక్యం

- **చోరీ బైక్, బంగారు గొలుసు స్వాధీనం**



**నిజామాబాద్ జిల్లా, జూలై 18(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ నగరంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను వెంబడించి, ఒకరిని పట్టుకోవడంలో ట్రాఫిక్ పోలీసులు చాకచక్యం ప్రదర్శించారు. నిందితుడి వద్ద నుంచి చోరీ చేసిన మోటార్‌సైకిల్‌తో పాటు ఒక బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య ఆదేశాల మేరకు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆర్ఐ వినోద్, ఆర్ఎస్ఐ దేవిసింగ్, సిబ్బంది నిఖిల్ సాయి చౌరస్తా వద్ద శుక్రవారం సాయంత్రం ప్రత్యేక వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ డ్రైవ్ నిర్వహించారు. ఆ సమయంలో నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వేగంగా రావడం గమనించి పోలీసులు ఆపబోయారు.పోలీసులను చూసి భయపడిన సదరు వ్యక్తులు బైక్‌ను అక్కడే వదిలేసి పరారయ్యేందుకు యత్నించారు. అప్రమత్తమైన పోలీసులు వెంటబడి వెంబడించగా ఒకరు పట్టుబడ్డారు. చీకటిని ఆసరాగా చేసుకుని మరో వ్యక్తి పరారయ్యాడు. నిందితుడిని తనిఖీ చేయగా అతని వద్ద ఒక బంగారు గొలుసు లభ్యమైంది. స్వాధీనం చేసుకున్న వాహనం చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు నిందితుడిని, సొత్తును సీసీఎస్ పోలీసులకు అప్పగించారు. పరారీలో ఉన్న వ్యక్తి కోసం గాలింపు ముమ్మరం చేశారు. సమయస్ఫూర్తితో నిందితుడిని పట్టుకున్న ట్రాఫిక్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో శిక్షణ పూర్తి చేసుకున్న ఎత్తోండ సర్పంచ్ శ్వేత

**కోటగిరి, నిజామాబాద్ జిల్లా, జూలై 18(డీడీ9 వార్త) :**

కోటగిరి మండలం ఎత్తోండ గ్రామ సర్పంచ్ శ్వేత సూర్యకాంత్ హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సర్పంచ్‌ల ప్రత్యేక శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ నెల 16 నుంచి 18 వరకు మూడు రోజుల పాటు జరిగిన ఈ శిక్షణ కార్యక్రమానికి నిజామాబాద్ జిల్లా నుంచి ఎంపికైన సర్పంచ్‌లలో ఆమె ఒకరుగా పాల్గొన్నారు. గ్రామ పాలనలో సమర్థవంతమైన పరిపాలన, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పంచాయతీ నిర్వహణ, ఆర్థిక క్రమశిక్షణ మరియు ప్రజా భాగస్వామ్యం వంటి కీలక అంశాలపై అధికారులు ఈ శిక్షణలో సర్పంచులకు సమగ్ర అవగాహన కల్పించారు. శిక్షణ ముగింపు సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా శ్వేత సూర్యకాంత్ ధృవీకరణ పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శ్వేత సూర్యకాంత్ మాట్లాడుతూ.. మూడు రోజుల శిక్షణలో నేర్చుకున్న అంశాలు గ్రామాభివృద్ధికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఎంతో దోహదపడతాయని తెలిపారు. సర్పంచుల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఇటువంటి రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమాలు ఎంతో కీలకమని ఆమె పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు మరియు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఎత్తోండ గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు మరింత చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు.





# ఓల్డ్ జల్లాపల్లిలో సి.సి. రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

**పోతంగల్, నిజామాబాద్ జిల్లా, జూలై 18(డీడీ9 వార్త) :**


పోతంగల్ మండల కేంద్రంలోని ఓల్డ్ జల్లాపల్లి గ్రామంలో సి.సి. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గ్రామాభివృద్ధిలో భాగంగా సర్పంచ్ ఆధ్వర్యంలో ఈ రోడ్డు పనులను చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లలిత మాట్లాడుతూ... గ్రామ పెద్దల ఆశీస్సులతో, అందరి సహకారంతో ఈ సి.సి. రోడ్డును నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల గ్రామ ప్రజలకు, ముఖ్యంగా కాలనీ వాసులకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని ఆమె పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని సర్పంచ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లలితతో పాటు ఉప సర్పంచ్ సుఖేందర్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# కోనసముందర్‌లో వాడివేడిగా సాగిన తల్లిదండ్రుల సమావేశం

**నిజామాబాద్ జిల్లా, జూలై 18(డీడీ9 వార్త) :**

కమ్మర్‌పల్లి మండలం కోనసముందర్‌లోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశం వాడివేడిగా సాగింది. 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల అభివృద్ధి, క్రమశిక్షణపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో, పెండింగ్‌లో ఉన్న పాఠశాల భవన నిర్మాణ పనులపై తల్లిదండ్రులు నిలదీయడంతో చర్చ వేడెక్కింది. పాఠశాల భవన నిర్మాణ పనులు సగంలోనే నిలిచిపోవడంపై తల్లిదండ్రులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్‌ను పిలిపించి పనులు ఎందుకు ఆపేశారని ప్రశ్నించగా.. తనకు రావాల్సిన బిల్లులలో సగం డబ్బులు మాత్రమే అందాయని, మిగతా డబ్బులు అకౌంట్‌లో పడితేనే పనులు ప్రారంభిస్తానని కాంట్రాక్టర్ సమాధానమిచ్చారు. దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు సంబంధిత ఏఈకి ఫోన్ ద్వారా సంప్రదించారు. స్లాబ్ లెవల్ వరకు పనులు పూర్తయ్యాయని, వెంటనే పనులు ప్రారంభిస్తే పెండింగ్‌లో ఉన్న పాత బిల్లులను విడుదల చేస్తామని ఏఈ స్పష్టం చేశారు. ఏఈ, కాంట్రాక్టర్ మధ్య మాటల యుద్ధం జరగడంతో సమావేశం కొంతసేపు వాడివేడిగా సాగింది. ప్రధానోపాధ్యాయులు మధుపాల్ మాట్లాడుతూ... విద్యార్థుల అభివృద్ధికి తల్లిదండ్రులు కచ్చితంగా పాటించాల్సిన ఆరు వాగ్దానాలను వివరించారు. పిల్లలను ప్రతిరోజూ పాఠశాలకు పంపడం, పాఠశాలకు రాకపోతే ముందస్తు సమాచారం ఇవ్వడం, ఇంటి వద్ద చదివించడం, పిల్లల పురోగతిపై ప్రతి నెలా ఉపాధ్యాయులతో సంప్రదించడం వంటి అంశాలపై తల్లిదండ్రుల నుండి వాగ్దానం తీసుకున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్ మాట్లాడుతూ...పిల్లలకు ప్రార్థన సమయంలో యోగా క్లాసులు ఉంటాయని, సమయపాలన పాటించాలని కోరారు. విద్యార్థులు పూర్తి యూనిఫాం ధరించాలని, ఆడపిల్లలు రెండు జడలు వేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఫోన్లకు, టీవీలకు అలవాటు పడకుండా కేవలం చదువుపైనే దృష్టి పెట్టేలా చూడాలని కోరారు. అలాగే, కోనసముందర్ రెసిడెన్షియల్ హాస్టల్ వార్డెన్ మాట్లాడుతూ, హాస్టల్‌లో సీట్లు ఖాళీగా ఉన్నాయని, స్థానిక గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





# సర్పంచ్ పావని కుటుంబానికి రూ. 50 వేల ఆర్థిక సాయం అందజేత

**నిజామాబాద్ జిల్లా, జూలై 18(డీడీ9 వార్త) :**

ఇటీవల గుండెపోటుతో అకాల మరణం చెందిన కమ్మర్‌పల్లి మండలం తాళ్ళారంపూర్ గ్రామ సర్పంచ్ బెజ్జరపు పావని కుటుంబాన్ని కమ్మర్‌పల్లి మండల సర్పంచుల ఫోరం సభ్యులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మృతికి సర్పంచులంతా సంతాపం వ్యక్తం చేశారు. సర్పంచ్ పావని మరణం గ్రామానికి, మండల సర్పంచుల ఫోరానికి తీరని లోటని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి కమ్మర్‌పల్లి మండల సర్పంచుల ఫోరం తరఫున రూ. 50 వేలు ఆర్థిక సాయాన్ని అందజేసి, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. కష్టకాలంలో ఆ కుటుంబానికి తామంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొని పావని చిత్రపటానికి నివాళులర్పించారు.




# కల్లూర్ ప్రభుత్వ పాఠశాలలో యూకేజీ చిన్నారులకు అక్షరాభ్యాసం

**పోతంగల్, నిజామాబాద్ జిల్లా, జూలై 18(డీడీ9 వార్త) :**

పోతంగల్ మండలంలోని కల్లూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో యూకేజీ చిన్నారులకు శనివారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం కనులపండువగా జరిగింది. పండుగ వాతావరణంలో జరిగిన ఈ వేడుకలో చిన్నారులు, వారి తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా విద్యాదేవత సరస్వతీ దేవిని ప్రత్యేకంగా పూజించారు. అనంతరం చిన్నారుల చేత సంప్రదాయబద్ధంగా బియ్యంలో తొలి అక్షరాలు దిద్దించి విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. చిన్నారుల విద్యా ప్రయాణం విజయవంతం కావాలని కోరుతూ వారికి స్లేట్లు, బలపాలు, మిఠాయిలను అందజేశారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, పిల్లల భవిష్యత్తుకు ప్రాథమిక విద్యే బలమైన పునాది అని, తొలి అడుగు నుంచే మంచి విలువలు, నాణ్యమైన విద్యను అందించడం ప్రతి ఉపాధ్యాయుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాంరెడ్డి, ఉప సర్పంచ్ దశరథ్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. చిన్నారుల చిరునవ్వులు, పలకపై తొలి అక్షరాల దిద్దుబాటుతో పాఠశాల ఆవరణ విద్యారంభ వేడుకతో సందడిగా మారింది.



# తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజును కలిసిన పోతంగల్ ప్రెస్ క్లబ్ సభ్యులు

**పోతంగల్, నిజామాబాద్ జిల్లా, జూలై 18(డీడీ9 వార్త) :**

పోతంగల్ మండలంలో నూతనంగా ఏర్పాటైన పోతంగల్ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కాసుల బాలరాజు మాట్లాడుతూ, సమాజంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని, వారు ప్రభుత్వం మరియు ప్రజల మధ్య వారధిగా వ్యవహరిస్తున్నారని కొనియాడారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ప్రభుత్వం నుంచి జర్నలిస్టులకు అందాల్సిన అన్ని రకాల పథకాలను, సౌకర్యాలను అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పున్నె అర్జున్, ఉపాధ్యక్షుడు గంధపు దత్తు, ప్రధాన కార్యదర్శి వడ్ల సురేష్, కార్యదర్శి బ్యాగారి విజయ్, సహా కార్యదర్శి ఎర్రోళ్ల యాదవరావు, కోశాధికారి సర్గు లక్ష్మణ్, గౌరవ సలహాదారులు నూతపల్లి గణేష్, కనకమెడల శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ పాకల గజేందర్, కార్యవర్గ సభ్యులు మొండే భీమ్రావు, కాంబ్లె రాజేష్, ముత్యాల శ్రీకాంత్, షేక్ అజారుద్దీన్, మేత్రి శీను తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పోచారంను కలిసిన పోతంగల్ ప్రెస్ క్లబ్ సభ్యులు

**పోతంగల్, నిజామాబాద్ జిల్లా, జూలై 18(డీడీ9 వార్త) :**

పోతంగల్ మండలంలో నూతనంగా ఏర్పాటైన పోతంగల్ ప్రెస్ క్లబ్ సభ్యులు శనివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో మీడియా వారధిగా నిలుస్తుందని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, వారికి అందాల్సిన అన్ని రకాల సంక్షేమ సదుపాయాలను కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు తమ సంఘం కార్యకలాపాలను వివరించడంతో పాటు, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పోచారం శ్రీనివాసరెడ్డి, సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొన్ని అర్జున్, ఉపాధ్యక్షుడు గంధపు దత్తు, ప్రధాన కార్యదర్శి వడ్ల సురేష్, కార్యదర్శి బ్యాగారి విజయ్, సహాయ కార్యదర్శి ఎర్రోళ్ల యాదవరావు, కోశాధికారి సర్గు లక్ష్మణ్, గౌరవ సలహాదారులు నూతపల్లి గణేష్, కనకమెడల శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ పాకల గజేందర్, కార్యవర్గ సభ్యులు మొండే భీమ్రావు, కాంబ్లె రాజేష్, ముత్యాల శ్రీకాంత్, షేక్ అజారుద్దీన్, మేత్రి శీను తదితరులు పాల్గొన్నారు.



# గోదావరి పుష్కరాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలి : డీజీపీ మహేష్ భగవత్

**నిజామాబాద్ జిల్లా, జూలై 18(డీడీ9 వార్త) :**

రానున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర డీజీపీ మహేష్ భగవత్ అధికారులను ఆదేశించారు. పుష్కరాల భద్రతా ఏర్పాట్లపై ఆయన గోదావరి పరివాహక ప్రాంత జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, ఘాట్ల వద్ద క్రౌడ్ మేనేజ్‌మెంట్, క్యూలైన్ వ్యవస్థ, అత్యవసర సేవలు, విపత్తు నిర్వహణ, డ్రోన్ నిఘా, సీసీ కెమెరాల పర్యవేక్షణ వంటి కీలక అంశాలపై ఆయన సమీక్షించారు. పుష్కరాలకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని, అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రతి ఘాట్ వద్ద తగిన పోలీసు బందోబస్తుతో పాటు మహిళా భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, తప్పిపోయిన వారి కోసం సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, భక్తులకు స్పష్టమైన మార్గదర్శక సూచికలను అందుబాటులో ఉంచాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, అదనపు డీసీపీ ఎన్.శుభం ప్రకాష్, వివిధ విభాగాల ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు మరియు పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల కుదింపు నిర్ణయం రాజ్యాంగ విరుద్ధం: డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శంతన్

**నిజామాబాద్ జిల్లా, జూలై 18(డీడీ9 వార్త) :**

రాష్ట్రంలో ఉన్న 27 వేల పాఠశాలలను 4 వేల పాఠశాలలకు కుదిస్తామన్న ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని, వెంటనే ఈ ప్రతిపాదనను విరమించుకోవాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శంతన్ డిమాండ్ చేశారు. కమ్మర్‌పల్లి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పర్యటించిన ఆయన రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఏ ప్రకారం బాలబాలికలందరికీ ఉచిత, నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయకపోవడం, మౌలిక వసతులు కల్పించకపోవడం వల్లే విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల బాట పడుతున్నారని ఆయన ఆరోపించారు. జీవో నెం. 25ను రద్దు చేసి, ప్రతి తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, నాణ్యమైన విద్య కోసం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా అధ్యక్షులు యం.బాలయ్య మాట్లాడుతూ... ఉపాధ్యాయుల వేతన సవరణ కోసం తక్షణమే పీఆర్సీ నివేదికను తెప్పించుకుని 40 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయుల బకాయిలు, పెండింగ్ బిల్లులను ఏకకాలంలో చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను అమలు చేయాలని కోరారు. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు దాటినా ఇప్పటికీ ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో అందజేయకపోవడంపై




అసహనం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి ఏజెన్సీలకు చెల్లించే రేట్లను సవరించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, విద్యారంగానికి బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించాలని, కేజీబీవీ మరియు మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి షేక్ మదర్, మండల కన్వీనర్ ఎం. ధర్మేందర్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎంపీడీఓ కార్యాలయమా? కాంగ్రెస్ పార్టీ కార్యాలయమా?

- **ఎంపీడీవో భద్రు నాయకపై బిఆర్ఎస్ నేతలు విమర్శలు**

**మంగపేట జూలై 18డీడీ9 వార్త**

మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ పార్టీ మంగపేట మండల మాజీ అధ్యక్షులు, జిల్లా సీనియర్ నాయకులు కుడుముల లక్ష్మీనారాయణ ఎంపీడీఓ కార్యాలయం ప్రభుత్వ కార్యాలయం. ఇది ప్రజలందరికీ సమానంగా సేవలు అందించే స్థలం. ఏ ఒక్క రాజకీయ పార్టీ కార్యకలాపాలకు వేదికగా మారడం సమంజసం కాదు. ప్రజా సమస్యలపై ఏ పార్టీ నాయకులైనా లేదా ప్రజాప్రతినిధులైనా ఎంపీడీఓను నేరుగా కలిసి వినతిపత్రాలు ఇవ్వడం, సమస్యలను వివరించడం సహజమైన ప్రక్రియ. అయితే ప్రభుత్వ కార్యాలయంలో ఒకే రాజకీయ పార్టీ సమావేశాలు నిర్వహించడం సరైన విధానం కాదు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుల ఆదేశాల మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు, పీడీఓ, పంచాయతీ కార్యదర్శుల తో సమావేశాలు నిర్వహించడం ప్రభుత్వ వ్యవస్థ తటస్థతపై సందేహాలు కలిగిస్తోంది. మండల అభివృద్ధి, ప్రజా సమస్యలు, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించాలనుకుంటే అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, ప్రజల ప్రతినిధులను ఆహ్వానించి పారదర్శకంగా సమావేశం నిర్వహించాలి. ప్రభుత్వ కార్యాలయాలు రాజకీయాలకు అతీతంగా ఉండాలి. అధికార యంత్రాంగం ఏ ఒక్క పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తుందనే భావన ప్రజల్లో కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ సమావేశాలకు అనుమతించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ఇలాంటి చర్యలు భవిష్యత్తులో అనవసర వివాదాలకు దారితీసే అవకాశం ఉంది. ఎంపీడీఓ కార్యాలయం ప్రజల సమస్యల పరిష్కారానికి కేంద్రంగా ఉండాలి గానీ, రాజకీయ పార్టీ కార్యకలాపాల నిర్వహణకు కేంద్రంగా మారకూడదు. ప్రభుత్వ అధికారులు అన్ని రాజకీయ పార్టీల పట్ల సమాన దూరం పాటిస్తూ, నిష్పక్షపాతంగా తమ విధులను నిర్వర్తించాలి. అదే ప్రజాస్వామ్య విలువలకు అనుగుణమైన విధానం.ఇకపై ప్రభుత్వ కార్యాలయాలను రాజకీయ పార్టీ సమావేశాలకు వేదికగా ఉపయోగించకుండా జిల్లా యంత్రాంగం తక్షణ




చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ కార్యాలయాల గౌరవాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తున్నాము.

## కోర్టు డ్యూటీ అధికారుల పనితీరును మెరుగుపరచాలి

- **శిక్షల శాతం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా.**

**డిడి9వార్త / రామగుండం జులై 19:**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కోర్టు డ్యూటీ,కోర్టు లైజనింగ్ పోలీసు అధికారులతో శనివారం సీపీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కోర్టు విధుల నిర్వహణ, కేసుల పురోగతి,శిక్షల శాతం పెంపు, సాంకేతిక సమస్యలు, సాక్షుల నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ,కోర్టు విధులకు సంబంధించిన ప్రతి పనిని నిర్దేశిత గడువులో నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు.విధుల నిర్వహణలో ఎదురయ్యే పరిపాలనా లేదా సాంకేతిక సమస్యలను దాచిపెట్టకుండా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.కోర్టు డ్యూటీ అధికారుల పనితీరును నిరంతరం సమీక్షిస్తున్నామని, ప్రతి అధికారి తన పనితీరును మరింత మెరుగుపర్చుకునే దిశగా కృషి చేయాలని సూచించారు. సమన్లు ,బెయిలు మంజూరు కాని అరెస్టు వారెంట్లు (ఎన్‌బీడబ్ల్యూలు), ఇతర వారెంట్ల అమలు,కోర్టుకు సంబంధించిన అన్ని ప్రక్రియలను వేగవంతంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.సాక్షులను కోర్టుకు సకాలంలో హాజరుపరిచే విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సాక్షులకు కోర్టు ప్రక్రియపై ముందస్తు అవగాహన కల్పించి, వారు ధైర్యంగా, స్పష్టంగా వాంగ్మూలం ఇచ్చేలా అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు.విచారణ సమయంలో అనవసర గందరగోళానికి గురికాకుండా వారికి ధైర్యం చెప్పి,న్యాయ ప్రక్రియపై సరైన అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి కేసులో శిక్షలు పడేలా దర్యాప్తు అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, సమయపాలన, నాణ్యమైన దర్యాప్తు, సమర్థవంతమైన కోర్టు నిర్వహణ ద్వారా మెరుగైన ఫలితాలు సాధించాలని సీపీ పే



ర్కొన్నారు.విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారులను ప్రతి నెల గుర్తించి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు.విధి నిర్వహణలో విశేష కృషి చేసి అనంతరం బదిలీపై వెళ్లిన అధికారుల దర్యాప్తు చేసిన కేసుల్లో తర్వాత శిక్షలు విధించబడినా, సంబంధిత అధికారుల సిఫారసు మేరకు వారికి కూడా గుర్తింపు,ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని వెల్లడించారు.రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో శిక్షల శాతాన్ని పెంచడం, ప్రతి కేసును సకాలంలో పూర్తి చేయడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్న పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు సమర్థవంతమైన న్యాయ సేవలు అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పలు కేసుల్లో నిందితులకు శిక్షలు పడడంలో కీలక పాత్ర పోషించిన కోర్టు డ్యూటీ సిబ్బందిని పోలీస్ కమిషనర్ శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్లు అనిల్ కుమార్, బాబురావు,ఎస్ఐ వినీత,కోర్టు డ్యూటీ సిబ్బంది, కోర్టు లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

## వర్షా కాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటాము.

- **మేయర్ మహంకాళి స్వామి.**

**డిడి9వార్త / రామగుండం జులై 19:**

శనివారం వివిధ డివిజన్ లలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించడంతో పాటు నాలా పూడిక తీత పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని గత నాలుగు నెలలుగా సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎక్కువగా ప్రభావం చూపే నాలాల్లో పూడిక తీత పనులు నిర్వహించడం జరిగిందని అన్నారు . అలాగే నాలా లో పెరిగిన పిచ్చి చెట్లు తొలగించడంతో నీళ్ళు ఎక్కడా నిలువకుండా సాఫీగా ప్రవహించి వరద ముప్పు ఉండదని అన్నారు. ఎం ఎల్ ఎ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వరద ప్రభావం చూపే ప్రాంతాల్లో కాంక్రీట్ తో కాలువల నిర్మాణం చేపట్టారని అన్నారు. ఉష్ణోగ్రతలు తగ్గిన నేపధ్యంలో రోడ్ల నిర్మాణాలు కూడా ప్రారంభమయ్యాయని అన్నారు. అంటువ్యాధుల నివారణపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టామని అన్నారు. కాగా మేయర్ ఉదయం 38, 39 డివిజన్ లలో ప్రవహిస్తున్న పెద్ద నాలాలో జరుగుతున్న పూడిక తొలగింపు పనులను స్థానిక కార్పొరేటర్ నెలకంటి రాముతో కలిసిపర్యవేక్షించారు. అనంతరం 46వ డివిజన్ లో ట్రాన్స్ జెండర్ లకు కేటాయించిన ఇంటి స్థలాల ప్రాంతాన్ని పరిశీలించి అత్యవసరంగా శుభ్రం చేసి చదును చేయించవల్సిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు . ఆ తరువాత మేడిపల్లి , పి కె రామయ్య కాలనీ లలో పర్యటించారు. నిర్మాణంలో ఉన్న రోడ్డు పనులను పరిశీలించారు. ప్రతిపాదిత కాలువల నిర్మాణ ప్రాంతాలను కూడా పరిశీలించారు. అనంతరం పి జి కళాశాల లో ఉపన్యాసకులు , విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయం మూల నుండి ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి వైపు రోడ్డు వెడల్పు చేయడానికి గల అవకాశాలను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వెంట కార్పొరేటర్ దాసరి సాంబమూర్తి , డేవిడ్ రాజు నగర పాలక సంస్థ టి పి ఓ నవీన్ , ఎ ఇ తేజస్విని , నాయకులు మడిపెల్లి మల్లేశం, గడ్డం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



## ములకపాడు ఆరోగ్య కేంద్రంలో అదనంగా ఇద్దరు డాక్టర్లను నియమించాలి

- **50 పడకల హాస్పిటల్ గా అప్ గ్రేడ్ చేయాలి**
- **సిపిఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య డిమాండ్**

**జూలై 18 డీడీ 9 వార్త దుమ్ముగూడెం**

దుమ్ముగూడెం మండలం ములకపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంని సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించడం జరిగింది. అనంతరం సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కారం పుల్లయ్య మాట్లాడుతూ ములకపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముగ్గురు డాక్టర్లు అవసరం ఉండగా ప్రజెంట్ ఒక డాక్టర్ మాత్రమే ఉన్నారని ఇంకా ఇద్దరు డాక్టర్ లు తక్షణమే నియమించాలని ఇందులో ఒకరు రెగ్యులర్ డాక్టరుగా మరొకరు మొబైల్ డాక్టర్ గా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. దుమ్ముగూడెం మండలం ఏజెన్సీ మారుమూల ప్రాంతాల నుండి ఇక్కడికి వస్తున్న పేషెంట్లకు ఒక డాక్టరు 24 గంటలు సర్వీసు చేయాలంటే సాధ్యం కాదు అని అన్నారు. సంబంధిత స్టాఫ్ కూడా పెంచాల్సినటువంటి అవసరం ఉందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.ఇంకా మొబైల్ నర్సుగా పనిచేస్తున్న ఆమెను ఇక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఉపయోగించుకుంటున్నారని అలాకాకుండా రెగ్యులర్ స్టాఫ్ నర్స్ ను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా అన్ని రకాల వైద్య సదుపాయం కల్పించాలని అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని ప్రభు



త్వాన్ని అధికారులను కోరారు. దుమ్ముగూడెం మండలం అతిపెద్ద మండలం కాబట్టి ఈ ములకపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల హాస్పటల్ గా అప్ గ్రేడ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎవరైనా మరణిస్తే ఇక్కడే పోస్టుమార్టం చేయాలని ఈ హాస్పిటల్ లో కేటాయించిన సిబ్బందిని వేరే ప్రాంతాలకు పంపుతున్నారని మా సర్వేలో వచ్చింది కాబట్టి భవిష్యత్తులో ఇక్కడే ఉంచే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు అదేవిధంగా ఇక్కడకు వస్తున్న పేషెంట్లుకు సౌకర్యాలు కల్పించాలని పాడైపోయిన మరుగుదొడ్లు మరమ్మత్తులు చేయించాలని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య,కొర్సా చిలకమ్మ, మండల కార్యదర్శి వర్గ సభ్యులు యలమంచి శ్రీనుబాబు, బొల్లి సత్యనారాయణ, మండల కమిటీ సభ్యులు మడకం మహేంద్ర నాథ్, సకినం ప్రేమ్ కుమార్, కల్లూరి లక్ష్మయ్య, నక్క సత్యనారాయణ, పుడుతూరి రాంబాబు, కల్లూరి శ్రీను, నాగరాజు ఇంకా తదితరులు పాల్గొన్నారు

## మూడు వారాల్లో 559 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

**నిజామాబాద్ జిల్లా, జూలై 18(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత మూడు వారాల వ్యవధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 559 మంది వాహనదారులు పట్టుబడ్డారని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య వెల్లడించారు. ఈ కేసులను నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ కోర్టులలో హాజరుపరచగా అందులో 31 మందికి వారం రోజుల పాటు జైలు శిక్ష పడగా, మిగిలిన వారికి మొత్తం రూ. 52,80,000 జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు. జూన్ 29 నుండి జూలై 17 వరకు జరిగిన ఈ ప్రత్యేక వాహన తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన 559 మందిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ స్పందిస్తూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే తీవ్ర ప్రమాదాల దృష్ట్యా ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. వాహనదారులు వాహన పత్రాలను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని, నిబంధనలను



అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారి డ్రైవింగ్ లైసెన్స్‌ను ఆరు నెలల పాటు సస్పెండ్ చేస్తామని, మద్యం మత్తులో ప్రమాదాలు జరిగితే వాహనాలకు ఇన్సూరెన్స్ క్లెయిమ్ లభించదని ఆయన స్పష్టం చేశారు. మైనర్లు వాహనాలు నడిపి పట్టుబడితే వారిపై, వాహన యజమానులపై ఛార్జ్ షీట్ దాఖలు చేయడంతో పాటు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని, ఒకసారి కంటే ఎక్కువ సార్లు పట్టుబడితే కచ్చితంగా జైలు శిక్ష పడుతుందని సీపీ హెచ్చరించారు. మోటార్ వెహికల్ యాక్ట్ 2019 సవరణ ప్రకారం మొదటిసారి పట్టుబడితే రూ.10 వేల జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష, రెండోసారి పట్టుబడితే రూ.15 వేల జరిమానా లేదా జైలు శిక్ష విధిస్తామని ఆయన పేర్కొన్నారు.




## గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ ప్రజల బాధ్యత

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూలై 18(డీడీ9 వార్త) :**

మన ఊరు - మన భద్రత - మన బాధ్యత కార్యక్రమంలో భాగం శనివారం సాలూర మండల కేంద్రంలో బోధన్ రూరల్ పోలీస్‌లు అవగాహన సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు, ప్రజలు సమన్వయంతో వ్యవహరించాలని బోధన్ రూరల్ ఎస్సై రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హెచ్చరించారు. పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలను వెల్లడించి మోసపోవద్దని కోరారు. ఒకవేళ సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేసి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

వర్షాకాలంలో అప్రమత్తత అవసరమని, తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకడం, తెగిపడిన విద్యుత్ తీగలకు దగ్గరగా వెళ్లడం వంటివి ప్రాణాపాయమని ఎస్సై వివరించారు. పాముకాటు వంటి అత్యవసర పరిస్థితుల్లో మూఢనమ్మకాలను నమ్మకుండా శాస్త్రీయ దృక్పథంతో వ్యవహరిస్తూ, బాధితుడిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని సూచించారు.గ్రామ పరిసరాల్లోని అపరిశుభ్రత విషపురుగుల వ్యాప్తికి కారణమవుతుందని,ప్రతి ఒక్కరూ గ్రామాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా, చట్టవ్యతిరేక కార్యకలాపాలు, మాదకద్రవ్యాల విక్రయాలు వంటివి జరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని,సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సరితమ్మ ..... మరో రోషమ్మ

- **మద్దుల పల్లిలో మందు బంద్**
- **సారా అమ్మితే కఠిన చర్యలు-జరిమానా ,**
- **మధ్య రహిత గ్రామమే లక్ష్యంగా అడుగులు**
- **సరితమ్మ (సర్పంచమ్మ )సంచలన నిర్ణయం**

**మహాదేవపురం జులై 18 ( డిడి 9వార్త )**

"సారా వ్యతిరేక " వ్యతిరేక ఉద్యమం... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని ఒక చిన్న ఊరులో రెండున్నర దశాబ్దాల కింద సాధారణ మహిళ ప్రారంభించిన సారా వ్యతిరేక ఉద్యమం, రాష్ట్ర మంతా పాకి రాష్ట్రం లో సంపూర్ణ మద్యనిషేధం కు దారితీసింది. అప్పటి ఉద్యమ నిర్మాత రోశమ్మ స్ఫూర్తితో నేడు తెలంగాణ లోని ఓ చిన్న ఊరులో సారా ( నాటు ) అమ్మినా, తయారు చేసినా వారికి జరిమానా, సమాచారం ఇచ్చిన వారికి నజరానా ప్రకటిస్తూ సర్పంచ్ సరితమ్మ సంచలన నిర్ణయం తీసుకుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం లోని మద్దులపల్లి లో గుడుంబా అమ్మకాలు, తయారీని పూర్తిగా అరికట్టేందుకు గ్రామ పంచాయతీ పాలకవర్గం కఠిన నిర్ణయాలు తీసుకుంది. గ్రామ సర్పంచ్ సరిత, ఉపసర్పంచ్ లచ్చిరెడ్డి, వార్డు సభ్యులు తేజస్విని, దేవిక, శ్రావణి, వెంకటేష్, మనక్క, గ్రామ కార్యదర్శి స్వాతి గ్రామంలోని పలు దుకాణాలను సందర్శించి దుకాణదారులకు సారా అమ్మవద్దంటు నోటీసులు అందించి హెచ్చరికలు జారీ చేశారు.

గ్రామంలో ఎవరైనా గుడుంబా అమ్మకాలు, తయారీ చేపడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పదివేల రూపాయలు జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. అలాగే గుడుంబా అమ్మకాలపై ఫోటోలు, ఆధారాలతో సమాచారం అందించిన వారికి వేయి రూపాయలు నజరానా అందజేస్తామని తెలిపారు. మద్యపానం వలన అనేక కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని, పచ్చని పల్లెల్లో చిచ్చులు పుడుతున్నాయని, గ్రామాన్ని గుడుంబా రహిత, మద్యపాన నిషేధిత ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్థులందరూ సహకరించాలని ఆమె విజ్ఞప్తిచేశారు.



# రూ. 2.55 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి.

- **ప్రభుత్వ పాఠశాలల్లో పౌష్టిక ఆహారం.**
- **ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ బడులు.**
- **కాంగ్రెస్ హయంలో విద్యారంగం అభివృద్ధికి అధిక ప్రాధాన్యం.**
- **సర్కారు బడుల్లో గణనీయమైన ఫలితాలు.**
- **బొంపెల్లి నుండి తెనుగుపల్లి వరకు 50 లక్షల రూపాయలతో బి.టి రోడ్డు నిర్మాణం.**
- **ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.**

**డిడి9వార్త / పెద్దపల్లి జులై 19:**

పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల, నిట్టూరు, తుర్కల మద్దికుంట, బొంపల్లి, రాగినేడు మరియు అప్పన్నపేట గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో రూ.2.55 కోట్ల డి.ఎం.ఎఫ్.టి నిధులతో స్థానిక నాయకులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.తదుపరి పెద్దకాల్వల గ్రామంలో నూతనంగా 5 లక్షల రూపాయలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డు ప్రారంభం మరియు బొంపెల్లి గ్రామంలోని ఆర్ & బి రోడ్డు నుండి తెనుగుపల్లి వరకు 50 లక్షల రూపాయలతో బి.టి రోడ్డు నిర్మాణం కోసం శంకుస్థాపన చేయడం జరిగింది...ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ..గత ప్రభుత్వ మరియు ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంతో పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా నిర్వీర్యం కావడం జరిగిందని అలాగే కాంగ్రెస్ ప్రజాప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలా అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు..ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి పెద్దకల్వల గ్రామ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ. 19 లక్షలు, నిట్టూరు గ్రామ పాఠశాలకు రూ. 45 లక్షలు, తుర్కల మద్దికుంట గ్రామానికి రూ. 48 లక్షలు, బొంపల్లి గ్రామానికి రూ.25 లక్షలు, రాగినేడు గ్రామానికి రూ. 58 లక్షలు, అప్పన్నపేట గ్రామానికి రూ. 60.50 లక్షల నిధులను వెచ్చించడం జరిగిందని అన్నారు. పెద్దపల్లి మండలం మరియు పట్టణంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం రూ.5.70 కోట్లను మంజూరు చేయడం జరిగిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని అందులో చదివే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని రాష్ట్రంలో పెద్దపల్లి జిల్లా విద్యారంగంలో టాప్ లో నిలిచిందని తెలిపారు. కాంగ్రెస్ సర్కారు విద్యారంగం అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యంగా పెట్టుకొని పని చేస్తున్నట్లు తెలిపారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచామని ప్రభుత్వ విద్యాసంస్థల్లో మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం అందించడం జరుగుతోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాసంస్థలకు మెరుగైన సదుపాయాలను అందిస్తున్నామని ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ బడులు అభివృద్ధి చెందుతున్నాయని పార్టీలకు అతీతంగా కలిసి కట్టుగా ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపుకు కృషి చేయాలని సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో విద్యాధికారులు, గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.







## పారిశ్రామిక ప్రాంతంలో మైనింగ్ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకై వినతి.

- **ఎంపీ గడ్డం వంశీకృష్ణ కి వినతి పత్రం ఇచ్చిన డివైఎఫ్ఐ జిల్లా నాయకులు.**

**డిడి9వార్త / పెద్దపల్లి జులై 19:**

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో మైనింగ్ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని శనివారం రోజు గోదావరిఖని ప్రాంతానికి విచ్చేసిన పెద్దపల్లి జిల్లా పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ కి కలసి డివైఎఫ్ఐ యువజన సంఘం జిల్లా కార్యదర్శి కొంటు సాగర్ జిల్లా నాయకులు మొగిలిచర్ల సురేష్, వీర సూర్య వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కొంటు సాగర్ మాట్లాడుతూ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఇంటర్ డిగ్రీ మరియు మెడికల్ కళాశాలతో పాటు త్వరలో నర్సింగ్ కాలేజీ కూడా ప్రారంభమవుతున్నా నేపథ్యంలో ఈ పారిశ్రామిక ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలంటే ఇక్కడ ప్రధాన వనరులైన బొగ్గు నిక్షేపాలు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో మైనింగ్ పాలిటెక్నిక్ కళాశాల అందుబాటులోకి వస్తే ఇక్కడ మా ఎంతో మంది విద్యార్థులకు మైనింగ్ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యను పూర్తి చేసి అనంతరం ఇదే ప్రాంతంలో ఎన్నో ఉద్యోగ అవకాశాలు కూడా వస్తాయని తద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి మరింత ముందుకు వెళుతుందని వారు ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారన్నారు. అంతే కాకుండా చాలామంది విద్యార్థులు వారి ఆర్థిక ఇబ్బందుల వల్ల దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునే స్తోమత లేక ప్రత్యామ్నాయ కోర్సులను తీసుకొని చదువుకుంటున్నారన్నారు. కాబట్టి ఇక్కడి పారిశ్రామిక ప్రాంత పరిశ్రమలను దృష్టిలో ఉంచుకొని మైనింగ్ పాలిటెక్నిక్ కళాశాలను అందుబాటులోకి తీసుకువస్తే ఎంతోమంది ఇక్కడి విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తును కల్పించిన వారు అవుతారని ఈ అంశం పైన వచ్చే పార్లమెంటు సమావేశంలో కూడా ప్రస్తావించాలని నాయకులు ఎంపీ కి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎంపీ కచ్చితంగా ఈ పారిశ్రామిక ప్రాంతంలో మైనింగ్ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు తన వంతుగా కృషి చేస్తానని వారు హామీ ఇవ్వడం జరిగిందన్నారు.

## ఓటు హక్కు భారత రాజ్యాంగం భారత పౌరుడికి కల్పించిన ప్రాథమిక హక్కు...

- **SIR కార్యక్రమంలో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలి..**

**మణుగూరు.జూలై 18 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు మండలం, అశోక్ నగర్ లో వాసవి నగర్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో సమితి సింగారం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, వాసవి నగర్ కమిటీ & వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..
కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న S.I.R (ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ) కార్యక్రమంలో మండలంలోని ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కు అనేది భారత రాజ్యాంగం భారత పౌరుడికి కల్పించిన ప్రాథమిక హక్కు,దానిని నమోదు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దోసపాటి నాగేశ్వరావు,వాసవి నగర్ కమిటీ అధ్యక్షులుకత్తి రాము,తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాజకీయ విభాగం కమిటీ వైస్ చైర్మన్ కడవెండి విశ్వనాధ్ గుప్తా, వందనపు వాసు,దోసపాటి ధర్మారావు, చల్లా రాజ నరేందర్, వారణాసి అరవిందు, ధర్మ జాగరణ సమితి జిల్లా ప్రముఖులు వల్లభనేని నాగేశ్వరరావు లు పాల్గొన్నారు.



## అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి నైనిష ఫౌండేషన్ ఆర్థిక సాయం

**మణుగూరు.జూలై 18(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక నియోజకవర్గం, మణుగూరు మండలంలోని రామానుజవరం గ్రామం అయోధ్య నగర్ కాలనీకి చెందిన కట్ట చిరంజీవి. అనారోగ్యంతో భద్రాచలం సూర్య హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. వారి పరిస్థితి చాలా దీనస్థితిలో ఉంది. ఆయన కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో , దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటోంది.ఈ కుటుంబం దయనీయ పరిస్థితిని తెలుసుకున్న నైనిష ఫౌండేషన్ సభ్యులు వెంటనే స్పందించి, కట్ట చిరంజీవికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.3,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నైనిష ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేద కుటుంబాలకు తమ సంస్థ అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ మట్టపల్లి సాగర్ యాదవ్, జర్నలిస్ట్ పోదిల వీరబాబు, అడ్వకేట్ ఈర్ల రాము, జర్నలిస్ట్ మిట్టపల్లి గోపి, సాధిని సీతయ్య, బాణాల కృష్ణ, బానోతు రమేష్ కంపేర్ల నాగేశ్వరరావు, కట్ట మహేష్, తదితరులు పాల్గొన్నారు.





## రాష్ట్ర మంత్రీ వర్యులు సీతక్క ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ తాడ్వాయి మండల అధ్యక్షులు మంకిడి నరసింహ స్వామి సూచనల మేరకు

- **నార్లపూర్ జెడ్పీపీఎచ్ ఎస్ పాఠశాలను సందర్శించిన నార్లపూర్ సర్పంచ్ తోలెం కృష్ణ ఉపసర్పంచ్ కట్కూరి భాస్కర్ రెడ్డి**

**తాడ్వాయి మండలం (డిడి9 వార్త రిపోర్టర్)**

ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలంలోని నార్ల పూర్ గ్రామంలో ఈతల్లిదండ్రుల సమావేశంలో ప్రధానోపాధ్యాయులు వెక్కి విధ్యాసాగర్ తో కలసి పాల్గొనడం జరిగింది యువత అన్నీ రంగాల్లో రాణించాలి తేదీ:18.07.2026 శనివారం తాడ్వాయి మండలం నార్లపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని జెడ్పీ పి హెచ్ ఎస్ పాఠశాలను సందర్శించిన నార్లపూర్ సర్పంచ్ తోలెం కృష్ణ ఉపసర్పంచ్ కట్కూరి భాస్కర్ రెడ్డి అనంతరం రాగి జవాను ప్రధానోపాధ్యాయులు వెక్కి విద్యాసాగర్ ఉపాధ్యాయుల ఆద్వర్యంలో ప్రారంభించడం జరిగింది ఈ సందర్భంగా సర్పంచ్ తోలెం కృష్ణ ఉపసర్పంచ్ కట్కూరి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం పాఠశాలల్ని కార్పొరేట్ దీటుగా తీర్చిదిద్దుతోందని అన్నారు విద్యార్థిని , విద్యార్థులు బాగా కష్టపడి చదువుకొని తల్లి తండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కొనియాడారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం , మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు



## వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని కాటాపురం గ్రామంలో వీధి దీపాల ఏర్పాట్లు గ్రామ సర్పంచ్ దిడ్డి మోహన్ రావు

**తాడ్వాయి మండలం డిడి9 వార్త రిపోర్టర్**

ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలంలోని కాటాపురం గ్రామంలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ ప్రజలకు రాత్రి వేళల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వీధి దీపాల (స్ట్రీట్ లైట్స్) బల్బులను గ్రామపంచాయతీ సిబ్బందితో ఏర్పాటు చేయించడం జరిగిందని కాటాపురం గ్రామ సర్పంచ్ శ్రీ దిడ్డి మోహన్ రావు తెలిపారు.
గ్రామంలోని ఏ వీధిలోనైనా వీధి దీపం పని చేయకపోయినా లేదా బల్బు కాలిపోయినా వెంటనే గ్రామపంచాయతీ కార్యాలయానికి లేదా సంబంధిత గ్రామపంచాయతీ సిబ్బందికి సమాచారం అందించాలని ఆయన కోరారు. సమాచారం అందిన వెంటనే గ్రామపంచాయతీ సిబ్బందితో బల్బులను మార్చించి, వీధి దీపాలను తిరిగి వెలిగేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు.
గ్రామంలో మెరుగైన మౌలిక వసతులు కల్పించడం గ్రామపంచాయతీ ప్రధాన లక్ష్యమని, ప్రజలు కూడా సమస్యలను వెంటనే తెలియజేసి సహకరించాలని సర్పంచ్ దిడ్డి మోహన్ రావు విజ్ఞప్తి చేశారు.



## అశ్వారావుపేటలో ముమ్మరంగా అభివృద్ధి పనులు రూ. 3.14 కోట్లతో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

- **క్షేత్రస్థాయిలో పర్యటించిన ఎంపీ రఘురామి రెడ్డి, ఎమ్మెల్యే ఆదినారాయణ, ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి ఆదేశం**

**అశ్వరావుపేట:జూలై 18(డిడి 9వార్త)**

ఖమ్మం జిల్లా పార్లమెంట్ సభ్యులు గౌరవ శ్రీ *రామసహాయం రఘురామి రెడ్డి * మరియు అశ్వారావుపేట శాసనసభ్యులు గౌరవ శ్రీ *జారె ఆదినారాయణ * సంయుక్తంగా దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా రూ. 3 కోట్ల 14 లక్షల 50 వేల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు మరియు శంకుస్థాపనలు చేశారు.
ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ, అభివృద్ధి పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ప్రజల నుంచి నేరుగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రధాన బాధ్యత అని, అందుకోసమే విశ్రాంతి లేకుండా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలతో మమేకం అవుతున్నామని తెలిపారు.
మొదటిగా నారవారిగూడెం కాలనీ, అల్లిగూడెం, ఊట్లపల్లి, మల్లాయగూడెం, అనంతారం, గాండ్లగూడెం, జెట్టివారిగూడెం, కొత్తూరు, మామిళ్ళవారిగూడెం, పాకలగూడెం, అసుపాక గ్రామాలలో నూతనంగా నిర్మించిన సీసీ (CC) రోడ్లను వారు ప్రారంభించారు.
అలాగే గుమ్మడివల్లి గ్రామంలో మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతానికి నిర్మించిన వీఓ (VO) భవనంతో పాటు సీసీ రోడ్డును ప్రారంభించారు. అసుపాక గ్రామంలో ప్రజల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన బోర్ వెల్, సీసీ రోడ్లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. అశ్వారావుపేటలో పర్యాటక రంగాన్ని పెంపొందించేలా నిర్మాణంలో ఉన్న కొమరం భీమ్ ఇకోపార్క్ పనులను ప్రజాప్రతినిధులు క్షుణ్ణంగా పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.
ఇదే క్రమంలో నూతన పనులకు శ్రీకారం చుడుతూ.. రమణక్కపేట గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి, తోగ్గూడెం గ్రామంలో తాగునీటి సమస్య నివారణకై బోర్ వెల్ నిర్మాణానికి ఘనంగా శంకుస్థాపనలు నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను తక్షణమే పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పరిష్కారమయ్యే పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉంచకూడదని, స్థానిక సమస్యలను అధికారులు వెంటనే ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చి వేగంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలపడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు,ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రం,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిన్నశెట్టి సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తుమ్మా రాంబాబు, కోల లక్ష్మి నారాయణ ,MRO ,ఎంపీవో రామ కోటి రెడ్డి , సర్పంచులు, వివిధ శాఖల అధికారులు,కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు,కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు___.



## వెంకటాపురం యువత రక్తదానం..

- **37 యూనిట్లతో ఎంతోమంది ప్రాణాలకు భరోసా..**

**జూలై18 డిడి 9 వార్త వెంకటాపురం.**

చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ, ములుగు జిల్లా వెంకటాపురం ఆధ్వర్యంలో మనోజ్ ఫిట్నెస్ సెంటర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో యువత స్వచ్ఛందంగా పాల్గొని 37 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. “అమ్మ జన్మనిస్తుంది___ రక్తదానం పునర్జన్మనిస్తుంది” అనే సందేశంతో సేకరించిన రక్తాన్ని తలసేమియా బాధిత చిన్నారులు, గర్భిణీ స్త్రీల కోసం రెడ్ క్రాస్ సొసైటీ, భద్రాచలంకు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని వెంకటాపురం సర్పంచ్ తాటి సరస్వతి, ఉపసర్పంచ్ సన్నీ, గ్రామ పెద్దలు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. చేయూత ఫౌండేషన్ అధ్యక్షుడు చిడం అయ్యప్ప మాట్లాడుతూ యువత చేసిన రక్తదానం ఎంతోమంది పేదల ప్రాణాలను కాపాడుతుందని అన్నారు. కార్యక్రమంలో చిట్టెం తాకయ్య, చిట్టెం సాయి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యాసం రమేష్, మనోజ్ ఫిట్నెస్ సెంటర్ నిర్వాహకుడు మనోజ్, కృష్ణ తేజ, ఇర్ప ఆదినారాయణ, ప్రమోద్, బట్టి విజయ్ సూర్య తదితరులు పాల్గొన్నారు.



# నిధులు మంజూరైనా కాని లబ్దిదారులకు రుణాలు ఇవ్వని వైనం

- **దళితబంధు పథకం పెండింగ్ 16 యూనిట్లు మంజూరు చేయలేదు,**
- **అంబేద్కర్ అభయ హస్తం ఊసే లేదు.**
- **కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రోత్సాహకాలు ఇవ్వని జిల్లా అధికారయంత్రాంగం.**
- **దళిత వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న అదనపు కలెక్టర్ అరుణ శ్రీ ని బదిలి చేయాలని ఎస్సి కమిషన్ కోరిన మద్దెల దినేష్.**

**డిడి9వార్త / రామగుండం జులై 19:**

దళిత సామజిక వర్గాలకు ప్రభుత్వాలు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే వాటిని పూర్తిగా విస్మరిస్తుందని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ కోరారు ఎస్సి కమిషన్ చైర్మెన్ మరియు సభ్యులను కోరారు.శనివారం రోజున పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లో ఎస్సి ఎస్టీ కమిషన్ సమీక్ష సమావేశం నిర్వహించిన సందర్బంగా మద్దెల దినేష్ పాల్గొని కమిషన్ చైర్మెన్ గారికి మరియు సభ్యులకు పలు అంశాలు వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని పేర్కొన్నారు.అనంతరం అయిన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎస్సి కార్పొరేషన్ ను పూర్తిగా నిర్వీర్యం చేసిందని పెద్దపల్లి జిల్లాలో 201819, 20202021 సంవత్సరాలకు సంబంధించి ఎస్సి కార్పొరేషన్ ద్వారా అర్హులైన రామగుండం, పెద్దపల్లి, మంథని నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు కూడా నిర్వహించి అనంతరం నిధులు మంజూరైనా సుమారు 1600 వందల మంది పేర్లను ఆన్ లైన్ లో తొలగించారని అసలు ఎందుకు తొలగించవలసి వచ్చిందో ఇప్పటికి తెలియదని కేవలం దళిత నిరుద్యోగులు బాగుపడితే ప్రభుత్వం జిల్లా అధికారులు జిర్ణించుకోలేరా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని వారు అగ్రహం వ్యక్తం. కార్పొరేషన్లు కకావికలం అత్యంత వెనకబడిన వర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, స్వయం ఉపాధికి రుణాలను అందిస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక భిన్నంగా వ్యవహరిస్తున్నరని, ముఖ్యంగా ఎస్సి కార్పొరేషన్ మాత్రం పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా నిర్ణయాలు తీసుకుంటూ వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. పెద్దపల్లి జిల్లాలో మాత్రం అతి ఉత్సాహంతో అధికారులు ఆకారణంగా ప్రజాప్రతినిదుల మాటలు విని పేర్లను తొలగించడం దుర్మార్గపు చర్య అని, ఇది వివక్ష కాద? అని ప్రశ్నించారు.గత ప్రభుత్వా హయాంలో జరిగినవి మనం ఇవ్వడం ఏమిటి అని అక్కసుతో నిరుద్యోగుల పొట్ట కొట్టారని ఆవేదన వ్యక్తం చేసారు.అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల హామీలో అంబేద్కర్ అభయ హస్తం పేరుతో 12లక్షలు ఇస్తామని చెప్పి అ పథకం ఊసే లేదని విమర్శించారు.అదే విధంగా కులాంతర వివాహాలు చేసుకున్న వారికీ కేంద్ర ప్రభుత్వం దళితులకు సామజిక భద్రత కల్పించడంతోపాటు వారికీ ఆర్థిక భరోసా కూడ కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు ఇంటర్ క్యాస్ట్ ఇన్సెంటివ్ స్కీమ్ పాధకాన్ని అమలు చేస్తుందని కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ఈ పథకం క్రింద 2లక్షల 50 వేల ప్రభుత్వాలు అందుజెస్తున్నాయని, ఇతర జిల్లాలో అధికారులు అర్హులకు కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని, కానీ పెద్దపల్లి జిల్లాలో మాత్రం ఎందుకు ఇవ్వడం లేదని, వాటి కోసం ఎంతో మంది వేచి చూస్తున్నారని హెచ్చరించారు.అలాగే దళిత వ్యతిరేఖ విధానాలు అవలంబిస్తున్న అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రామగుండం ఇంచార్జ్ కమిషనర్ న అరుణశ్రీ




లాంగ్ స్టాండింగ్ అధికారిగా కొనసాగుతు దళిత కార్మికుల పట్ల, సిబ్బంది పట్ల పూర్తిగా వివక్ష చూపుతు నిరంకుశంగా వ్యవహరిస్తూ దళిత అధికారులను మరియు సిబ్బంది కార్మికుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న అరుణ శ్రీ ని వెంటనే పెద్దపల్లి జిల్లా నుండి బదిలి చేయాలని కోరమని తెలిపారు.కావున ఇట్టి విషయాలు పట్ల పూర్తిగా విచారణ చేసి చర్యలు తీసుకుంటామని కమిషన్ చైర్మెన్ & సభ్యలు హామీ ఇచ్చారని దినేష్ తెలిపారు.

# సింగరేణి బొగ్గు నాణ్యతపై రాజీ లేదు.

- **ఉత్పత్తి నుంచి డిస్పాచ్ వరకు ప్రత్యేక పర్యవేక్షణ**
- **ఏరియాల వారీగా స్పెషల్ అధికారుల నియామకం.**

**డిడి9వార్త / రామగుండం జులై 19:**

సీఎండీ డా. బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశాలు సింగరేణి భవన్, జులై 18, 2026 రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తిని పెంచడంతో పాటు, ప్రకటించిన గ్రేడ్‌కు అనుగుణంగా నాణ్యమైన బొగ్గును నిరంతరాయంగా సరఫరా చేయడానికి సింగరేణి సంస్థ ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించింది. ఈ మేరకు ఏరియాల వారీగా ప్రత్యేక అధికారులను (స్పెషల్ ఆఫీసర్లు) నియమిస్తూ సింగరేణి సీఎండీ డా. బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశాలు జారీ చేశారు.రానున్న మూడు నెలల పాటు ఈ ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన ఏరియాల్లో బొగ్గు ఉత్పత్తి, నాణ్యత, గ్రేడ్ పరిరక్షణ, డిస్పాచ్, ఉత్పాదకత, పనితీరు మెరుగుదల, ఏరియాలు-కార్పొరేట్ విభాగాల మధ్య సమర్థవంతమైన సమన్వయం, అలాగే కార్పొరేట్ సామాజిక బాధ్యత (సి ఎస్ ఆర్ ) కార్యక్రమాల అమలును నిశితంగా పర్యవేక్షించనున్నారు.

- డైరెక్టర్ (ఆపరేషన్స్)కు సత్తుపల్లి, ఇల్లందు ఏరియాలు,
- డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్)కు మణుగూరు, భూపాలపల్లి ఏరియాలు,
- డైరెక్టర్ (ఫైనాన్స్)కు బెల్లంపల్లి, మందమర్రి ఏరియాలు,
- డైరెక్టర్ (ఈ అండ్ ఎం)కు ఆర్జీ1, ఆర్జీ3 ఏరియాలు,
- ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్)కు ఆర్జీ2, నైనీ ఏరియాలు,
- జనరల్ మేనేజర్ (మార్కెటింగ్)కు శ్రీరాంపూర్, అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలను ప్రత్యేక అధికారులుగా కేటాయించారు.శనివారం సాయంత్రం సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో బొగ్గు ఉత్పత్తి, బొగ్గు నాణ్యత, గ్రేడ్ పరిరక్షణ, డిస్పాచ్ అంశాలపై సీఎండీ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.

అలాగే సింగరేణి ఈ సందర్బంగా డా. బుద్ధ ప్రకాష్ జ్యోతి మాట్లాడుతూ, సింగరేణి బొగ్గు నాణ్యతే సంస్థకు గుర్తింపని, దానిపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోమని స్పష్టం చేశారు. ప్రకటించిన గ్రేడ్‌కు అనుగుణంగా వినియోగదారులకు బొగ్గు సరఫరా జరిగేలా అన్ని ఏరియాల్లో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

కొన్ని ఏరియాల్లో అన్‌గ్రేడెడ్ బొగ్గు, షేల్ కలవడం వల్ల నాణ్యత పడిపోతుందని అధికారులు పేర్కొనగా.. అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సీఎండీ సూచించారు. వార్షిక కోల్ గ్రేడేషన్ ప్రణాళిక ప్రకారం సీమ్‌ల వారీగా బొగ్గు తవ్వకాలు తప్పనిసరిగా చేపట్టాలని, ప్రకటించిన గ్రేడ్‌కు అనుగుణంగానే ఉత్పత్తి జరగాలని ఆదేశించారు.

అఫ్‌లోడింగ్ ప్రాంతాల్లో బ్లాస్టింగ్‌కు ముందు బొగ్గు బెంచీలను పూర్తిగా శుభ్రం చేయాలని, బొగ్గు బెంచీలు, ఓవర్‌బర్డెన్ బెంచీల మధ్య తగినంత దూరం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాయి, షేల్ పొరలను బొగ్గుతో కలపకుండా ప్రత్యేకంగా తవ్వి ఓవర్‌బర్డెన్‌లోనే డంప్ చేయాలని, బొగ్గు గ్యాలరీల శుభ్రత, ఫైరీ కోల్ నిర్వహణకు రూపొందించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (SOPs)ను అన్ని ఏరియాల్లో కచ్చితంగా అమలు చేయాలన్నారు.

అన్ని ఓపెన్‌కాస్ట్ గనులు, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్లలో తగిన సంఖ్యలో క్రషర్లు ఏర్పాటు చేసి, అవి ఎప్పటికప్పుడు సక్రమంగా పనిచేసేలా నిర్వహించాలని సూచించారు.

ప్రతి కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో రోజువారీ, గ్రేడ్‌వారీ బొగ్గు డిస్పాచ్ ప్రణాళికను ముందుగానే రూపొందించి, దానిని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఉత్పత్తి నుంచి డిస్పాచ్ వరకు ప్రతి దశలో నాణ్యత నియంత్రణకు అధికారులు వ్యక్తిగత బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. సింగరేణి బొగ్గు నాణ్యతపై వినియోగదారులకు ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడం ప్రతి అధికారి బాధ్యత అని, ప్రకటించిన గ్రేడ్‌కు అనుగుణంగా నాణ్యమైన బొగ్గు సరఫరా చేయడం ద్వారా సంస్థ ప్రతిష్టను మరింత పెంచాలన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ(ఆపరేషన్స్), కె.వెంకటేశ్వర్లు (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్), ఎం .తిరుమలరావు ( ఈ అండ్ ఎం), ఈడీ (కోల్ మూవ్‌మెంట్) బి.వెంకన్న, జీఎం(కో ఆర్డినేషన్, మార్కెటింగ్) టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో కరపత్రాలను ఆవిష్కరించిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ గద్దల రమేష్.

**మణుగూరు.జూలై 18 (డి డి 9వార్త)**

ఈ నెల 26వ తేదీన కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించనున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల మరియు జిల్లా ఎస్సీ సెల్ నూతన కార్యవర్గ కమిటీల పదవీ స్వీకార మహోత్సవం సందర్భంగా రూపొందించిన కరపత్రాలను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ గద్దల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దల రమేష్ మాట్లాడుతూ, పదవీ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథులుగా జిల్లా మంత్రులు, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్, మనకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జాడి రాంబాబు, జిల్లా జనరల్ సెక్రటరీ దేపంగి వెంకటరమణ, పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొట్టే అనిల్ కుమార్, ఆళ్లపల్లి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇనుముల ఇందుకుమార్, అశ్వాపురం మండల అధ్యక్షుడు రావులపల్లి నరసింహారావు, మణుగూరు నాయకులు బర్ల శ్వేతన్, పోడుతూరి రవి, జాడి శ్రీనివాస్, కరకగూడెం మండల ప్రతినిధులు, బూర్గంపాడు మండల అధ్యక్షుడు కేసుపాక రాజేష్, మణుగూరు పట్టణ అధ్యక్షుడు పోడుతూరి రవికుమార్, పినపాక నాయకుడు చిట్టిమల్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# ఆదివాసీ మహిళలపై దాడులు అమానుషం

- **మనుబోతులపాడు ఆదివాసీ మహిళలపై దాడి చేసిన అటవీ శాఖ అధికారుల ఉద్యోగాలను తొలగించాలి: ఆదివాసీ జేఏసీ..**

**చర్ల, జూలై 18 (డిడి 9వార్త )**

చర్ల మండల కేంద్రంలోని తుడుందెబ్బ ఆఫీస్ ఆవరణలో శనివారం నిర్వహించిన ఆదివాసీ సంఘాల జేఏసీ సమావేశంలో జేఏసీ చైర్మన్ వాసం ముసలయ్య మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం, మనుబోతులపాడు పంచాయతీ వేములూరు గ్రామంలో శుక్రవారం జరిగిన పోడు భూమిలో సాగులో వున్న ఆదివాసుల పై అటవీ అధికారులు దాడులు చేయడం, వారిపై దౌర్జన్యం చేయడం చాలా దుర్మార్గమైనదని, గత ముప్పై ఏళ్ల నుండి సాగు చేస్తున్న దాదాపు ముప్పైఐదు హెక్టార్ల పోడుభూమిని లాక్కునే ప్రయత్నం చేసి భయభ్రాంతులకు గురి చేసినటువంటి అటవీ అధికారుల వల్ల ఆరుగురు మహిళలకు తీవ్రగాయాలైనట్లు అసభ్యంగా, విచక్షణరహితంగా మహిళలు పై దాడి చేసినటువంటి అటవీ అధికారుల పై మానవహక్కుల ఉల్లంఘన, ఆదివాసీ మహిళల హక్కుల భంగపాటు, కేంద్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్, తెలంగాణ ఎస్టీ కమిషన్ ఈ కేసును సుమోటోగా తీసుకొని సంబంధిత అధికారులను ఐదవ షెడ్యూల్ ఏరియా పై అవగాహన లేని అధికారులను తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసుల పోడుభూముల పై దాడులు చేయటం గాని భూములు లాక్కునే ప్రయత్నం చేయడాన్ని ఆదివాసీ సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నట్లు జిల్లాలో ఏ ఘటన జరిగిన అక్కడ వారి పక్షాన అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఆ గ్రామంలో మౌలిక సదుపాయాలు పోడుభూములకు రక్షణగా సర్వేలు జరిపిన పోడు భూములకు రక్షణగా పట్టాలు వెంటనే మంజూరు చేయాలని ఈ విషయంలో జిల్లా కలెక్టర్, ఐటిడిఏ పీఓ చొరవ తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాస రావు ఉద్యోగ సంఘం జేఏసీ సరెం సమ్మయ్య జేఏసీ సీనియర్ నాయకులు తాటి రామకృష్ణ, సోయం రాజారావు, పున్నం రామకృష్ణ, ఇర్ప రాజు దొర, ఇర్ప ప్రకాష్ దొర, పూనెం వరప్రసాద్, కారం నరేష్, కంగాల అభిరామ్, తాటి వెంకట్రావు, శ్యామల తరుణ్, కోరం భిక్షపతి, పూనెం రవికిరణ్ మహిళ నాయకులు ఇర్ప అపర్ణ బీరబోయిన రాణి తదితరులు పాల్గొన్నారు.






# గిరిజనులపై అటవీ శాఖ దాడులు ఆపివేయాలి.

- **మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు డిమాండ్.**


**మణుగూరు. జూలై 18(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,అశ్వాపురం మండలం లోని మనుబోతులగూడెం అటవీ గ్రామంలో పోడు పట్టా దారులపై అటవీ అధికారుల దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్టు బిఆర్ఎస్ పార్టీ మణుగూరు మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం నాడు మణుగూరు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ,మనుబోతులగూడెం గ్రామంలో పోడు పట్టాదారులపై ఫారెస్ట్ అధికారులు విచక్షణా రహితంగా దాడి చేశారని ఆరోపించారు. మహిళలు అని కూడా చూడకుండా జట్టు పట్టుకుని ఈడ్చుకుంటూ చిత్రహింసలకు గురిచేశారని, పత్తి పంటను సైతం ధ్వంసం చేశారని ఆయన ఆరోపించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు ఎంతో పోరాడి గిరిజనులకు పోడు పట్టాలు ఇప్పించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.సమస్యలుంటే సామరస్యంగా మాట్లాడి పరిష్కారం చేసుకోవాలి గానీ, ఇలా భౌతిక దాడులకు దిగడం హేయమైన చర్య అని ఆయన పేర్కొన్నారు.భవిష్యత్తులో ఇటువంటి దాడులు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. బిఆర్ఎస్ పార్టీ గిరిజనులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూకారపు రమేష్, అక్కి నరసింహారావు,ముద్దంగుల కృష్ణ, ఎస్కే మౌలానా, జావిద్ భాష, తురక రామకోటి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# యువ సంగ్రామ సదస్సులో జనగామ బీఆర్ఎస్ నేతలు

**జనగామ జూలై 18(డిడి 9వార్త )బ్యూరో**

హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ సంగ్రామ సదస్సులో జనగామకు చెందిన బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. జనగామ పట్టణ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు తిరుమల్ రెడ్డి, యువ నాయకులు సురేష్ గౌడ్, శ్రవణ్, టౌకిర్, అరవింద్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా యువత సమస్యలు, నిరుద్యోగం, ఉద్యోగాల కల్పన, యువ హక్కుల పరిరక్షణ అంశాలపై జరిగిన చర్చలను ఆసక్తిగా విన్నారు. యువత భవిష్యత్తు కోసం బీఆర్ఎస్ చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతు తెలుపుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి యువశక్తిని సంఘటితం చేస్తామని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జనగామ నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ ఫారాలపై అవగాహన.. సమస్యల పరిశీలన

**జనగామ జులై 18(డిడి 9వార్త )బ్యూరో**

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు రఘునాతపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాదే మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రఘునాథపల్లి మండల కేంద్రంలో ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాల నింపుదలపై అవగాహన కల్పించారు. అనంతరం డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ఇందిరమ్మ ఇండ్ల అంశాలపై వాడవాడలా పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామానికి ఎక్కువ ఇందిరమ్మ ఇండ్లు, అభివృద్ధి నిధులు కేటాయించేలా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో కోళ్ల రవి గౌడ్, మహమ్మద్ ఇబ్రహీం పాషా, కడారి రవి తదితరులు పాల్గొన్నారు.



# దమ్మాయిగూడలో లో ఘోర రోడ్డు ప్రమాదం.

- **ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఇసుక లారీ బాలుడు మృతి.**
- **కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు.**

**జవహర్ నగర్, జులై 18,(డిడి 9వార్త ):**

జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దమ్మాయిగూడ పరిధిలోని శివనగర్ శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జవహర్ నగర్ సిఐ సైదులు తెలిపిన కథనం ప్రకారం... దమ్మాయిగూడ లోని శివనగర్ లో మహమ్మద్ సిరాజ్ దంపతులు ఇద్దరు పిల్లలతో టైలరింగ్ పని చేసుకుంటూ నివసిస్తున్నారు. శనివారం సెయింట్ ఆంటోనీ పాఠశాలలో చదువుతున్న సిరాజ్ చిన్న కుమారుడు సుఫియాన్ ను (13) పెద్ద కుమారుడు సైఫ్ స్కూటీపై పాఠశాల వద్ద దించి రావడానికి వెళుతుండగా మార్గ మధ్యలో లేబర్ అడ్డా వద్ద గుర్తుతెలియని ఇసుక



లారీ అతివేగంగా నిర్లక్ష్యంగా స్కూటీని ఢీకొట్టడంతో సుఫియాన్ ఘటన స్థలంలోనే మృతి చెందాడు. ప్రమాదంలో సైఫ్ కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న జవహర్ నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# జాన్వీ కపూర్ తమిళ ఎంట్రీ ఫిక్స్!



బీటౌన్ బ్యూటీ జాన్వీకపూర్ ఇప్పటికే..'దేవర', 'పెద్ది' చిత్రాలతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. రెండు సినిమాల్లోని జాన్వీ పాత్ర గ్లామర్‌కే అంకితం కావడంతో ఫ్యాన్స్ నిరుత్సాహం చెందారు. ఇదిలా ఉంటే.. ఇప్పుడు ఈ అమ్మడు కోలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నది. ఈ మేరకు వెబ్‌సిరీస్‌తో జాన్వీ తమిళం ఇండస్ట్రీ ఎంట్రీ ఇవ్వడం విశేషం. 'కురథి' అనే టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ వెబ్‌సిరీస్‌కు తమిళ టాప్ డైరెక్టర్ పా రంజిత్ నిర్మించబోతుండగా.. సర్కునమ్ దర్శకత్వం వహించనున్నారని ఇప్పటికే వార్తలు రాగా దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ మాత్రం రాలేదు. ఈ క్రమంలోనే తాజాగా కురథి వెబ్ సిరీస్‌కు సంబంధించిన ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ వచ్చింది. ఈ తమిళ ఒరిజినల్ సిరీస్ నిర్మాణాన్ని ప్రారంభించడానికి నెట్‌ఫ్లిక్స్ సిద్ధమైందని సమాచారం. దీందో త్వరలోనే వెబ్‌సరీస్‌పై అఫీషియల్ అప్డేట్ రావడంతో పాటు షూటింగ్ కూడా స్టార్ట్ చేయనున్నారట మేకర్స్.

# తెలుగులో ఉన్న ఐక్యత అక్కడ లేదు

వృత్తిపరంగా తన ఎదుగుదల తెలుగు చిత్రసీమలోనే జరిగిందని అంటోంది అందాల తార రకుల్ ప్రీత్ సింగ్. బాలీవుడ్ కంటే తెలుగు చిత్రపరిశ్రమలో ఐక్యత, పరస్పర సహకారం ఎక్కువగా ఉంటాయని చెప్తోంది. పలు హిట్ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైందీ భామ. ప్రస్తుతం హిందీ చిత్రాలతో బిజీగా గడుపుతోన్న రకుల్.. టాలీవుడ్, బాలీవుడ్ పరిశ్రమల మధ్య తేడాల గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. "టాలీవుడ్‌లో ఒకరి సినిమాల్ని మరొకరు ప్రచారం చేస్తూ.. బహిరంగంగా మద్దతు ఇస్తుంటారు. అక్కడ బలమైన పోటీ ఉన్నప్పటికీ ఎలాంటి సంకోచం లేకుండా ఇతర నటీనటుల విజయాలను మనస్ఫూర్తిగా ఎంజాయ్ చేస్తారు. కానీ బాలీవుడ్‌లో పరిస్థితులు ఇలా లేవు. ఇక్కడ సినీతారల మధ్య ఉన్న అభద్రతా భావం ఒకరికొకరు మద్దతు ఇచ్చుకోకుండా అడ్డుకుంటుంది. ముంబయిలో ప్రతికూల ప్రచారం సర్వసాధారణమైపోయింది. దానిని తొలగిస్తే బాలీవుడ్ తిరిగి గాడిలో పడుతుంది. అందరూ ఏకతాటిపై నిలిస్తేనే అది మరింత బలమైన పరిశ్రమగా మారుతుంద"ని అంది రకుల్.





# జానీ మాస్టర్ కు షాక్


ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు (Jani Master) తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ బిగ్ షాక్ ఇచ్చింది. ఫెడరేషన్ నిబంధనలకు విరుద్ధంగా, సంస్థ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారనే తీవ్ర ఆరోపణలపై ఆయనను ఆల్ ఇండియా స్థాయిలో ఫిల్మ్ ఫెడరేషన్ నుండి బహిష్కరిస్తున్నట్లు సంచలన ప్రకటన చేసింది. ఇటీవల జరిగిన ఓ సమావేశంలో జానీ మాస్టర్ యూనియన్ సభ్యులను రెచ్చగొట్టే విధంగా మాట్లాడారని, ఆయన ప్రవర్తన సంస్థ ప్రతిష్టకు తీవ్ర భంగం కలిగించేలా ఉన్నాయని ఫెడరేషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ.. ఈ వివాదాస్పద వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాల్సిందిగా జులై 14న జరిగిన అంతర్గత విచారణకు హాజరుకావాలని ఫెడరేషన్ జానీ మాస్టర్‌ను ఆదేశించింది. అయితే, ఆయన ఈ విచారణకు హాజరు కాకపోవడంతో ఫెడరేషన్ పెద్దలు మరింత మండిపడ్డారు.

బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినందుకు గాను, రాబోయే 7 రోజుల్లోగా దీనిపై పూర్తిస్థాయి లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని స్పష్టం చేశారు. అలాగే, ఇండస్ట్రీ వర్గాలకు బహిరంగ క్షమాపణలు చెప్పకపోతే కఠిన క్రమశిక్షణా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జానీ మాస్టర్‌పై బహిష్కరణ వేటు వేసిన నేపథ్యంలో, భవిష్యత్తులో ఆయన కొరియోగ్రఫీ చేసే ఏ సినిమాకైనా, ప్రాజెక్టుకైనా ఫెడరేషన్ తరఫున ఎలాంటి సహకారం (Non-cooperation) అందించబోమని యూనియన్ స్పష్టం చేసింది. ఫెడరేషన్ మళ్లీ తదుపరి నిర్ణయం తీసుకునే వరకు ఈ సహాయ నిరాకరణ దేశవ్యాప్తంగా కొనసాగుతుందని ప్రకటించింది.

జానీ మాస్టర్ భార్య సుమలతకు కూడా హెచ్చరికలు మరోవైపు డ్యాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు, జానీ మాస్టర్ భార్య సుమలత తీరుపై కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అసోసియేషన్‌కు సంబంధించిన జనరల్ బాడీ తీసుకునే నిర్ణయాలకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని సూచించింది. వ్యక్తిగత ఎజెండాల పక్కనబెట్టి, సాధారణ డ్యాన్సర్ల ఉపాధికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# ఓటీటీ రిలీజ్‌కు సిద్ధమైన 'బాలన్ ది బాయ్'

'మంజుమ్మెల్ బాయ్స్' మలయాళ సినిమాతో ఇండియా వైడ్‌గా గుర్తింపు తెచ్చుకున్న డైరెక్టర్ చిదంబరం తెరకెక్కించిన సరికొత్త సినిమా 'బాలన్ ది బాయ్'. కేవీఎన్ ప్రొడక్షన్స్ తెస్పియన్ ఫిలింస్ సంస్థలు సంయుక్తంగా ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని నిర్మించాయి. మనందరికీ బాగా కనెక్ట్ అయ్యే ఒక చక్కటి నేటివిటీ కథతో, అలాగే ప్రతి ఒక్కరి మనసును హత్తుకునే బలమైన సెంటిమెంట్, భావోద్వేగాలతో రూపొందిన ఈ మూవీ ఈ ఏడాది జూన్ 19న తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదలై బిగ్గెస్ట్ హిట్ అందుకుంది. చిన్న సినిమాగా వచ్చిన ఈ మూవీ అత్యధిక ప్రేక్షకాదారణ పొంది సూపర్ సక్సెస్ అందుకుంది. ఇప్పుడు ఈ మూవీ ఓటీటీ రిలీజ్‌కు సిద్ధం అయింది. బాలన్ ది బాయ్ డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ Zee5 సొంతం చేసుకోగా..జులై 31 నుండి మలయాళం, తమిళం, తెలుగు & కన్నడలో ప్రసారం కాబోతున్నట్లు అఫీషియల్‌గా ప్రకటించింది.



# మూడో వివాహం.. ఆమిర్ ఖాన్‌కు బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులు


బాలీవుడ్ అగ్రకథానాయకుడు ఆమిర్ ఖాన్‌కు (Aamir Khan) గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బెదిరింపులు వచ్చాయి. బిష్ణోయ్ సోదరుడు అర్జూ, మరో వ్యక్తి టైసన్‌లకు సంబంధించిన ఓ ఆడియో క్లిప్ బయటకు వచ్చింది. ఆమిర్ మూడో వివాహం చేసుకొని మతపరమైన వివాదానికి తావిచ్చారని.. ఇది భారతీయ సంస్కృతికి వ్యతిరేకమని వారు హెచ్చరించారు. త్వరలోనే దీనికి పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆ ఆడియోలో బెదిరింపులకు పాల్పడ్డారు.


ఇటీవల ఆమిర్ ఖాన్ తన ప్రియురాలు గౌరీ స్ప్రాట్‌ను వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనపై మతపరమైన విమర్శలు వస్తున్నాయి. ఇప్పుడీ విషయంపైనే బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి హెచ్చరికలు వచ్చాయి. ఇటీవల కొందరు బాలీవుడ్ ప్రముఖులను కూడా ఈ గ్యాంగ్ బెదిరించింది.



## 'వారణాసి' సర్‌ప్రైజ్..
# ప్రియాంక లుక్ రిలీజ్

మహేశ్ బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న చిత్రం 'వారణాసి'(Varanasi). ఇందులో మహేశ్‌కు జోడీగా బాలీవుడ్ నటి ప్రియాంక కనిపించనున్న విషయం తెలిసిందే. మందాకిని పాత్రలో ఆమె సందడి చేయనున్నారు. నేడు ఆమె పుట్టినరోజు సందర్భంగా సినిమా సెట్‌లోని ఫొటోలను విడుదల చేస్తూ రాజమౌళి (SS Rajamouli) పోస్ట్ పెట్టారు. 'ఆమె నవ్వితే అందం.. నవ్వకపోతే నిప్పు కణిక' అనే క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మహేశ్ (Mahesh Babu) కూడా ప్రియాంకకు విషెస్ చెప్పారు. 'మా ఒకే ఒక్క మందాకినికి హ్యాపీ బర్త్‌డే..' అని పోస్ట్ పెట్టారు. ప్రియాంక 'వారణాసి' కోసం 14 నెలల నుంచి షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఇందులో అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చేసినట్లు ఆమె చెప్పారు. ఇక ఈ చిత్రంలో రుద్ర, శ్రీరాముడిగా మహేశ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ప్రపంచంతో పాటు కాలాల్ని చుట్టేసే సాహసికుడి కథగా ఇది ముస్తాబవుతున్నట్లు తెలిసిందే. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రానున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ ఏడాది అక్టోబర్ నాటికి చిత్రీకరణ పూర్తి చేసి ప్రచారాన్ని ప్రారంభించనున్నారు





# 'గుర్తుకొస్తున్నాయి'... నాకొక మంచి ఆరంభం!



"90వ దశకానికి చెందిన జ్ఞాపకాలు నా జీవితంలో ఓ ముఖ్యమైన భాగం. అవే నిర్మాతగా నా కెరీర్‌కీ ఓ మంచి ఆరంభాన్నిచ్చాయి" అన్నారు శరత్‌చంద్ర నాయుడు. ఆయన నిర్మాణంలో రూపొందిన 'గుర్తుకొస్తున్నాయి' వెబ్‌సిరీస్ ప్రస్తుతం ఈటీవీ విన్‌లో విజయవంతంగా స్ట్రీమింగ్ అవుతోంది. ఈ నేపథ్యంలో శరత్ శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ "గుర్తుకొస్తున్నాయి' సిరీస్ విడుదలైన వెంటనే ప్రేక్షకుల నుంచి అనూహ్యమైన స్పందన లభించింది. ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే ఆనాటి జ్ఞాపకాలు, హాస్యం, మనసుల్ని హత్తుకునే భావోద్వేగాలు ప్రేక్షకులకు ఎంతగానో నచ్చాయి. అందుకే ఈ సిరీస్‌కి ఎప్పటికప్పుడు ఆదరణ పెరుగుతూనే ఉంది. ఇంటిల్లిపాదీ కలిసి చూసే ఓ మంచి కథ కావడంతో... కుటుంబ ప్రేక్షకుల ఆదరణ కూడా లభించిందీ సిరీస్‌కి. ఈ ప్రయాణం నా జీవితంలో ఓ మైలురాయి. మార్కెటింగ్ ప్రేక్షకుల అభిరుచులు, ఆలోచనలకు సంబంధించి ఎన్నో విషయాల్ని నాకు నేర్పింది. ఆ అనుభవం, అవగాహనే ఈ సిరీస్ రచన, నిర్మాణంపై ఎంతో ప్రభావం చూపించింది. సినిమా రంగంలో ఓ కొత్త ప్రయాణానికీ శ్రీకారం చుట్టిన ఈ సిరీస్‌ని, కథానాయకుడు అల్లు అర్జున్ ప్రోత్సాహాన్ని ఎప్పటికీ మరిచిపోలేను" అని చెప్పారు.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500201. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.